# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 280 | హైదరాబాద్ | శనివారం 02-05-2026 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

నా బయోపిక్ తీయాలని ఉంది.. నేనే తీస్తా: మల్లారెడ్డి

## దేశంలో కొత్త శకం..
# ఇక టోల్ ప్లాజాలో ఆగక్కర్లేదు!

- దేశంలో తొలి బారియర్-ఫ్రీ టోల్ ప్లాజా ప్రారంభం
- సూరత్ సమీపంలో ఆగకుండానే టోల్ చెల్లించే విధానం
- ఫాస్ట్‌ట్యాగ్, నంబర్ ప్లేట్ రీడింగ్ ద్వారా ఆటోమేటిక్‌గా వసూలు
- 2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా అమలుకు కేంద్రం ప్రణాళిక
- ట్రాఫిక్ రద్దీకి చెక్, భారీగా ఇంధనం ఆదా అయ్యే అవకాశం 11లో



## ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన
# మేడే గిఫ్ట్ ఇదే: కేటీఆర్ చురక

- ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం అలవాటుగా మారిందని విమర్శ
- రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్న కేటీఆర్
- కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డికి పట్టడం లేదన్న కేటీఆర్
- రాహుల్ గాంధీ ఆటో ఎక్కితే, ఆ డ్రైవర్ తన రెండు ఆటోలు అమ్ముకున్నాడని వ్యాఖ్య 11లో




11లో

## అధ్యక్ష పీఠంపై మునీర్ కన్ను
# భారత్‌పై ఉగ్ర కుట్ర!

- జమ్మూకశ్మీర్‌లో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ సైన్యం కుట్ర పన్నుతున్నట్టు నిఘా వర్గాల సమాచారం
- భారత్ ప్రతీకార దాడి చేసేలా రెచ్చగొట్టి, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే అసలు లక్ష్యం
- పాక్ సైన్యాధ్యక్షుడు అసిమ్ మునీర్ తన అధ్యక్ష పదవి ఆకాంక్షల కోసమే ఈ ప్లాన్ చేస్తున్నట్టు విశ్లేషణలు
- స్థానిక యువతతో దాడులు చేయించి, తర్వాత పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు రెండంచెల వ్యూహం

## బెంగాల్ రీపోలింగ్
# 15 బూత్‌లలో రేపే పోరు!

- ఎన్నికల అక్రమాలపై అందిన నివేదికలతో ఈ నిర్ణయం
- మగ్రాహట్‌లో 11, డైమండ్ హార్బర్‌లో 4 బూత్‌లలో మళ్లీ పోలింగ్ 11లో
- ఫల్టా నియోజకవర్గంలోనూ 30 బూత్‌లలో రీపోలింగ్ జరిగే అవకాశం
- ఈవీఎం బటన్‌పై వచ్చిన ఫిర్యాదుతో ప్రత్యేక పరిశీలకుడి విచారణ





## డీజీపీగా సీవీ ఆనంద్
# బాధ్యతలు

- ఈ ఉదయం డీజీపీ కార్యాలయానికి చేరుకున్న సీవీ ఆనంద్
- సాదరంగా స్వాగతం పలికిన ఉన్నతాధికారులు
- క్షేత్ర స్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు విశేష అనుభవం ఉన్న అధికారి ఆనంద్ 11లో

# ప్రజా క్షేత్రంలో చంద్రబాబు

- కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్ ప్రారంభం
- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- రూ.7 కోట్ల వ్యయంతో దాతల సహకారంతో ఆసుపత్రి నిర్మాణం
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్
- ప్రారంభం అనంతరం ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించిన సీఎం 11లో





## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు..
# ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం

- అంతిమంగా సామాన్యుడిపై భారం పడుతుందని ఆందోళన
- హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులకు ఆర్థిక భారమన్న మంత్రి 11లో
- ఎన్నికల తర్వాత ధరల పెంపు మోసం చేయడమేనని వ్యాఖ్య



## నాడు వద్దన్నా వినలేదు
# వరంగల్ విభజనపై కడియం

- పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదన్న కడియం శ్రీహరి
- కేసీఆర్ అహంకారం నచ్చకపోవడం వల్లే నాయకులు దూరం జరుగుతున్నారని వ్యాఖ్య
- నాడు రాజీనామా చేయకుండా బీఆర్ఎస్‌లో చేరిన వారికి కేసీఆర్ మంత్రి పదవులు ఇచ్చారని ఆగ్రహం 11లో

# పెట్రోలియం ఉత్పత్తులపై రేషనింగ్

నెల క్రితం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఇంధన భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో భారత్ వద్ద సుమారు 66 రోజుల వినియోగానికి సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గత నెల రోజులుగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, ప్రధాన సముద్ర మార్గాల్లో రవాణాకు ఆటంకాలు కలగడం వల్ల దిగుమతుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి.భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతోంది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 4.5 నుంచి 5 మిలియన్ బారెళ్ల ముడి చమురును మనం దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ, ప్రస్తుత సరఫరా ఆటంకాల వల్ల ఈ దిగుమతుల్లో 10 నుంచి 15 శాతం వరకు లోటు కనిపిస్తోంది. రష్యా నుంచి వచ్చే చమురు రవాణా మార్గాల్లో బీమా ,షిప్పింగ్ సమస్యలు తలెత్తడం, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే సరఫరాలో జాప్యం జరగడం వల్ల రిఫైనరీలకు అందే ముడి చమురు పరిమాణం తగ్గింది. ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం గయానా , బ్రెజిల్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం సవాలుగా మారింది.దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని ఈ కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రస్తుతం ఎటువంటి తక్షణ కొరత లేదని, ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే, రిటైల్ మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కొన్ని చమురు కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. చమురు ధరలు బారెల్ కు 100 డాలర్ల మార్కును దాటి స్థిరంగా కొనసాగితే, భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణ భారం విపరీతంగా పెరుగుతుంది.పశ్చిమాసియాలో పరిస్థితులు మారకపోతే ఇంధన రేషనింగ్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు. రాబోయే రెండు వారాల్లో దిగుమతులు మళ్ళీ గాడిలో పడతాయని, కేంద్రం రష్యా , ఇతర దేశాలతో జరుపుతున్న చర్చలు సఫలమైతే పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తదని కేంద్రం నమ్మకంతో ఉంది.

కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లుగా వస్తున్న ఊహాగానాల్ని కొట్టిపారేసింది. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ విభాగం నుంచి ధరల పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటనా రాలేదని.. నకిలీ ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఫేక్ సోషల్ మీడియా పోస్టుల్ని కోట్ చేస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. 'ఈ ఆర్డర్ నకిలీది. భారత ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వుల్ని అసలు జారీ చేయలేదు.' అని అందులో పేర్కొంది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు ఈ నకిలీ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.దేశంలో పెట్రోల్ ధర రూ. 10, డీజిల్ ధర రూ. 12.50 పెరిగినట్లు.. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి సర్క్యులర్ వచ్చినట్లుగా ఉన్న ప్రెస్ నోట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. దీనినే నకిలీది అని కేంద్రం స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ వార్తల్ని, ప్రకటనల్ని నమ్మొద్దని.. ఇలాంటి వార్తల్ని ధ్రువీకరించుకునేందుకు ఎల్లప్పుడూ అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఛానెళ్లను చూడాలని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 94.77 గా ఉండగా.. డీజిల్ రూ. 87.67 పలుకుతోంది. ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ. 103.54, రూ. 90.03 వద్ద ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయి.దేశంలో ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 29నే బెంగాల్‌లో చివరి దశ పోలింగ్‌తో.. ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో.. కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో.. ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరల్ని కేంద్రం పెంచుతుందని వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేం ఉండదని.. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, కేంద్రం కూడా బదులిస్తూ వచ్చాయి.అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు రవాణాకు కీలకంగా ఉన్న హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. మరోవైపు ఇరాన్ ఓడరేవుల్ని అమెరికా దిగ్బంధించింది. అక్కడ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. భారత్‌లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయి. క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒకవైపు.. కొన్ని పెట్రోల్ బంకులు రద్దీగా కనిపిస్తుంటే.. కొన్ని నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ధరల్ని పెంచుతుందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ ధర ఏప్రిల్ 30న.. 125 డాలర్ల మార్కును చేరి.. నాలుగేళ్ల గరిష్ఠానికి చేరింది.అటు సరఫరాను పునరుద్ధరించడం, ఇటు ధరలను అదుపులో ఉంచడం ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా, అంతర్జాతీయ పరిణామాలను బట్టి రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# మోడీ కోసం మహానాడులో మార్పులు

శ్రీకాకుళం ,మే1,

తెలుగుదేశం పార్టీ పండుగకు సమీపిస్తోంది సమయం. మహానాడు నిర్వహణకు సంబంధించి స్వల్ప మార్పు చేసింది టిడిపి నాయకత్వం. ప్రతి సంవత్సరం ఎన్టీఆర్ జయంతి నాడు పార్టీ మహానాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఉత్తరాంధ్రలో నిర్వహించాలని పార్టీ నాయకత్వం భావించింది. శ్రీకాకుళం జిల్లాలో నిర్వహిస్తామని పార్టీ నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చి ఏర్పాట్లు కూడా ప్రారంభించింది. స్థల పరిశీలన కూడా చేసింది. కానీ ఇప్పుడు మార్పు అనివార్యం అని తెలుస్తోంది. జూన్లో ప్రధాని నరేంద్ర మోడీ ఉత్తరాంధ్ర పర్యటన ఉంది. అంతకు కొద్ది రోజుల ముందే మహానాడు నిర్వహించడంతో.. ప్రధాని పర్యటనకు అంత హైప్ రాదని భావించింది టిడిపి హై కమాండ్. అందుకే మహానాడు ను వేరే ప్రాంతంలో నిర్వహించాలని సూత్రప్రాయంగా ఒక నిర్ణయానికి వచ్చి ఏర్పాట్లు ప్రారంభించింది.భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం ఒక కొలిక్కి వచ్చింది. ట్రయల్ రన్ కూడా పూర్తయింది. ఎయిర్పోర్టును జూన్ లోకాని జూలైలో కానీ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సభ దృష్ట్యా.. మహానాడు నిర్వహణ అంత శ్రేయస్కరం కాదు అని టిడిపి హై కమాండ్ భావించింది. అందుకే మహానాడు ను శ్రీకాకుళం నుంచి నెల్లూరుకు షిఫ్ట్ చేసింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో టిడిపి నాయకత్వం నిమగ్నం అయ్యింది. ఒకే ప్రాంతంలో రెండు భారీ కార్యక్రమాల నిర్వహణ అనేది సమంజసం కాదు అని భావించి శ్రీకాకుళం నుంచి మహానాడు ను.. నెల్లూరుకు తరలించింది.నెల్లూరు జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఎక్కువ. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన మూడు ఎన్నికల్లో.. రెండుసార్లు ఆ జిల్లాలో గెలిచింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. మొన్నటి ఎన్నికల్లో మాత్రం కూటమి స్వీప్ చేసింది. అదే బలాన్ని నెల్లూరు జిల్లాలో కొనసాగించాలి అంటే మహానాడు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన ధైర్యం నింపాలని పార్టీ నాయకత్వం భావిస్తోంది. నెల్లూరులో మహానాడు నిర్వహించడం ద్వారా దక్షిణ ఆంధ్రాలో క్యాడర్లో మరింత ఉత్సాహం నింపాలని చూస్తోంది నాయకత్వం. ఇప్పటికే దీనిపై పార్టీ నేతలకు ప్రాథమిక ఆదేశాలు వెళ్లాయి. నేతలు ఏర్పాట్లలో నిమగ్నమం అయ్యారు.

పవన్ తో బంధంపై వ్యూహం

ఇప్పటి రాజకీయంలో నాయకులకు కొదువ లేదు. ఉండాల్సింది పార్టీ ముద్ర. రాజకీయ పార్టీ అండదండలు లేనిది ఎవరు నాయకుడిగా మనలేరు. గతంలో ప్రతి ఎన్నికల్లోను ఇండిపెండెంట్ ల హవా ఉండేది కానీ. ఇప్పుడు మాత్రం ఆ పరిస్థితికి తావు లేదు. కచ్చితంగా నాయకులకు ఏదో ఒక పార్టీ అండ ఉండాల్సిందే. ఆ పార్టీ టిక్కెట్ పై పోటీ చేయాల్సిందే. అది తప్పని చర్య కూడా. అందుకే రాజకీయ పార్టీలు అన్నాక నేతలు చాలా జాగ్రత్తగా ఉంటారు. అధినేతల విషయంలో గౌరవభావంతో మెలుగుతుంటారు. కానీ ఏపీలో కూటమి విషయంలో వారి వైఖరి మారుతోంది. జనసేనతో కలిసి వెళ్లడం తెలుగుదేశం పార్టీ సీనియర్లకు ఇష్టం లేదు. టిడిపితో వెళ్లడం జనసేన నేతలకు నచ్చడం లేదు. ఎప్పటికప్పుడు ఏదో రకమైన ఇబ్బందులు తెచ్చి పెడుతూనే ఉన్నారు. కానీ అధినేతలు మాత్రం సర్దుకుపోవాలని సూచిస్తున్నారు. అయితే ఇప్పటివరకు బాహటంగా దీనిని చెప్పుకొచ్చారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన సైనికులకు. ఇప్పుడు చంద్రబాబు సైతం సర్దుకు పోవాల్సిందేనని తేల్చి చెప్పారు టిడిపి శ్రేణులకు.మరో 15 సంవత్సరాల పాటు కూటమి కొనసాగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదేపదే చెబుతూ వచ్చారు. సొంత పార్టీ శ్రేణులకు సర్దుబాటు చేసుకోవాలని సూచిస్తూ వచ్చారు. ఇప్పుడే కాదు పవన్ కళ్యాణ్ మొన్నటి ఎన్నికలకు ముందు కూడా ఇటువంటి వ్యాఖ్యలే చేశారు. ఎట్టి పరిస్థితుల్లో టిడిపి తో సర్దుబాటు ధోరణితో ముందుకు వెళితేనే జనసేనకు భవిష్యత్తు ఉంటుందని ఒక విధంగా చెప్పుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే మాట చెప్పారు. జనసేనకు శతశాతం విజయం దక్కింది. అయినా సరే పవన్ వైఖరిలో మార్పు రాలేదు. ఇప్పటికీ జన సైనికులకు సర్దుబాటు చేసుకోవాల్సిందేనని తేల్చి చెప్పారు. ఎన్నికలకు ముందు తర్వాత పొత్తు ఇష్టం లేని నేతలు బయటకు వెళ్ళిపోవచ్చు అని కూడా చెప్పారు పవన్.టిడిపి కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు చంద్రబాబు. ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా జనసేనతో కలిసి నడుస్తామని తేల్చి చెప్పారు. సర్దుకు పోవాల్సిందేనని టిడిపి సీనియర్లకు స్పష్టతనిచ్చారు. ఎవరి పేరు చెప్పకుండా ఫ్లెక్సీ ల పేరుతో.. ప్రోటోకాల్ పేరుతో ఇబ్బందులు పెడితే కుదరని పనిగా తేల్చేశారు. పవన్ కళ్యాణ్ తో లాంగ్ జర్నీ ఉంటుందని సీనియర్లకు నేరుగా చెప్పారు చంద్రబాబు. దీంతో ఇష్టం ఉన్నవారు ఉండండి.. లేనివారు వెళ్లిపోండి అన్నట్టు మాట్లాడారు. పవన్ కళ్యాణ్ తో తన బంధం గురించి ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. తనతో పాటు పవన్ కళ్యాణ్ కు గౌరవం ఇవ్వాల్సిందేనని తేల్చేశారు. ప్రస్తుతం చంద్రబాబు కామెంట్స్ పై తెలుగుదేశం పార్టీలో బలమైన చర్చ నడుస్తోంది.

# జనసేనలో నెంబర్-2 నేతకు ప్రోటోకాల్ ఇష్యూసా?

విజయనగరం ,మే1

వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక అసెంబ్లీ సీటు నుంచి ఎమ్మెల్యేగా కంటెస్ట్ చేయాలనుకుంటున్న ఎమ్మెల్సీ నాగబాబు..శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో కాపులు ఉండటమే అందుకు కారణమన్న చర్చ ఉంది. అయితే ఎచ్చెర్లలో వరుసగా పర్యటనలు చేస్తూ..ప్రజలకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్న నాగబాబుకు అనుకోని చిక్కులు వచ్చి పడుతున్నాయట. కూటమిలోని మిగతా పార్టీల నుంచి హార్ట్ ఫుల్‌గా మద్దతు లభించట్లేదట.అటు అధికార యంత్రాంగం కూడా ఆయన విషయంలో ప్రోటోకాల్ పాటించట్లేదట. అధికారిక కార్యక్రమాలకు నాగబాబుకు ఇన్విటేషన్ పంపకపోవడంపై జనసేన క్యాడర్ రగిలిపోతోందట. అధికారిక కార్యక్రమాలకు తనను ఆహ్వానించకపోవడంపై కూడా నాగబాబు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారట. ముఖ్యంగా అరసవల్లి రథసప్తమి వేడుకలకు, సూర్యనారాయణ స్వామివారి కళ్యాణ మహోత్సవాలు సమయంలో ఎమ్మెల్సీగా ఉన్న తనకు కనీసం ఆహ్వానం పంపకపోవడం, ప్రోటోకాల్ పాటించకపోవడంతో విస్తుపోయారట నాగబాబు. ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని ఎంచుకున్న నాగబాబును అధికార యంత్రాంగం విస్మరించడం వెనుక మిత్రపక్షాల్లోని కీలక నేతల ఒత్తిడి ఉందనే ఆరోపణలు చేస్తున్నారు జనసేన నేతలు.ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధి, అధికారిక కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ కల్పించకపోవడంపై నాగబాబు శాసన మండలి ఆఫీస్‌కు కంప్లైట్ చేశారట. శాసన మండలి సెక్రటరీ జనరల్ స్పందించి జిల్లా కలెక్టర్‌కు లేఖ రాయడం హాట్ టాపిక్ అయింది. ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనల్లో ప్రోటోకాల్ పాటించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు



ఇచ్చింది. ప్రోటోకాల్ నిబంధనలు పాటించేలా..అధికారిక కార్యక్రమాలకు నాగబాబుకు ఆహ్వానం పలికేలా ఆదేశాలు అందాయట. అయితే జనసేన చీఫ్ సోదరుడు..పైగా సిట్టింగ్ ఎమ్మెల్సీ..జనసేనలో నెంబర్-2గా చెప్పబడుతున్న నాగబాబుకు ప్రోటోకాల్ ఇష్యూస్ రావడం ఏంటి.? ఆయన శాసనమండలి సెక్రటరీ జనరల్‌కు కంప్లైంట్ చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది.అయితే ఎచ్చెర్ల టీడీపీ సీనియర్ నేత మాజీ మంత్రి కళా వెంకట్రావు ఇలాకా. మొన్నటి ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేయాలని కళా అనుకుంటే టీడీపీ అధిష్టానం ఆయనను చీపురుపల్లికి పంపించింది. అయితే 2029లో తన కుమారుడు రామ్ మల్లిక్ నాయుడుకు ఎచ్చెర్ల సీటు కోరే ఆలోచనలో కళా వెంకట్రావు ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగరం ఎంపీగా ఉన్న కలిశెట్టి అప్పలనాయుడు కూడా ఎచ్చెర్లకు చెందిన వారే. ఆయన కూడా 2029లో ఇక్కడ నుంచి పోటీకి ప్లాన్స్ చేసుకుంటున్నారు. ఇప్పుడు నాగబాబు పర్యటనలతో ఎచ్చెర్ల పాలిటిక్స్‌పై ఇంట్రెస్టింగ్ డిస్కషన్ నడుస్తోంది.అయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో పట్టు కోసం నాగబాబుని వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీ చేయించే ఆలోచనలో జనసేన అధినేత పవన్ ఉన్నారని అంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటినుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో బిజీగా ఉన్న నాగబాబుకు..ప్రోటోకాల్ ఇష్యూస్, అధికార యంత్రాంగం తీరు అసంతృప్తి కలిగించాయట. రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయి..వారంలో మూడు నాలుగు రోజులు ఎచ్చెర్లలోనే మకాం వేసేలా ప్లాన్ చేస్తున్నారట నాగబాబు.

# బెజవాడ వైసీపీకి నేతలు కావలెను..

విజయవాడ ,మే1,

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ? నియోజకవర్గ సమన్వయకర్తల పనితీరు ఇప్పుడు పార్టీలోనే చర్చగా మారింది. మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా? 2024 ఎన్నికల్లో ఒక్క చోట కూడా పార్టీ బోణీ కొట్టలేదు. కూటమి పార్టీలు వంద శాతం సీట్లు గెల్చుకోగా?జిల్లాలో వైసీపీ జీరో అయింది. అయితే? అంత ఘోరమైన ఓటమి నుంచి కూడా త్వరగా కోలుకున్న పార్టీ అధిష్టానం రెండేళ్ళుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు పిలుపునిస్తోంది. కానీ? ఉమ్మడి కృష్ణాలోని నియోజకవర్గాల ఇన్ఛార్జ్‌లు చాలామంది అధిష్టానం పిలుపునిచ్చిన స్థాయికి తగ్గట్టుగా స్పందించడం లేదన్నది పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ. ఈ వ్యవహారం పెద్దల దృష్టికి కూడా వెళ్ళిందట. దీంతో వివిధ నియోజకవర్గాల ఇన్ఛార్జ్‌లు, స్థానిక నేతల పనితీరుకు సంబంధించిన ఫీడ్ బ్యాక్ రిపోర్ట్స్ తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది.నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అక్రమాలకు సంబంధించి స్థానిక పార్టీ నేతలు అనుకున్న స్థాయిలో రెస్పాండ్ అవ్వటం లేదన్నది ఫ్యాన్ అధిష్టానం అభిప్రాయం. కేవలం కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ఇన్చార్జ్‌లు అనుకున్న స్థాయిలో స్పందిస్తున్నారని, ఎక్కువ చోట్ల సైలెంట్ మోడ్‌లో ఉండటంపై ఆరా తీస్తున్నారట. ప్రధానంగా మచిలీపట్నం రాజకీయాలు గతంలో లేనంత హాట్ హాట్ గా మారిపోయాయి. ఇక్కడ నిత్యం మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ మంత్రి పేర్ని నాని వర్గాల మధ్య నువ్వా నేనా అన్నట్టు ఉంటోంది. మంత్రికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు పేర్ని. నియోజకవర్గంలో ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగితే వాటిపై కూడా క్షేత్రస్థాయికి వెళ్ళి ఆందోళనకు దిగుతున్నారు. పామర్రులో ఇసుక, మట్టి దోపిడీ, పేకాట, చెరువు తవ్వకాల మీద మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ ఆందోళన చేయటంతో పాటు సోషల్ మీడియాలో కూడా ఎమ్మెల్యే తీరుపై విమర్శలు చేస్తున్నారు. పెనమలూరులో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యవహారాలపై ఇన్ఛార్జ్ దేవభక్తుని చక్రవర్తి నిత్యం ఆందోళనకు చేయటం ద్వారా ఎమ్మెల్యే కంట్లో నలుసుగా మారారనేది లోకల్ టాక్.అటు నందిగామలో మొండితోక బ్రదర్స్ వర్సెస్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్న విధంగా వ్యవహారం మారింది. ఈ పోరులో మొండి తోక బ్రదర్స్ పై స్థానికంగా పలు కేసులు కూడా నమోదయ్యాయి. అటు వల్లభనేని వంశీ కూడా ఎన్ని కేసులు పెడుతున్నా గన్నవరంలో ఇళ్ళ పట్టాల సమస్యకు సంబంధించి నేరుగా జిల్లా కలెక్టర్ కలిసి మరి ఫిర్యాదులు చేస్తున్నారు. మైలవరంలో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, ఆయన బావమరిది పోసాని కోటేశ్వర రావు నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారంటూ ఆరోపిస్తున్నారు జోగి రమేష్. బూడిద, మైనింగ్,మట్టి అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ధ్వజమెత్తుతున్నారాయన. వీళ్ళు తప్ప మిగతా ఎవరూ? పార్టీ ఆశించిన స్థాయిలో పని చేయడం లేదని వైసీపీ అధిష్టానం గుర్తించినట్టు తెలిసింది. ప్రధానంగా విజయవాడ నగరాన్ని పరిశీలిస్తే? ఇక్కడ నుంచి గతంలో వెలంపల్లి శ్రీనివాస్ మంత్రిగా పని చేశారు. కానీ? అధికారం కోల్పోయిన దగ్గర నుంచి ఆయన పార్టీ ఆదేశించిన కార్యక్రమాలకు మాత్రమే పరిమితం అవుతున్నారు తప్ప? నియోజకవర్గంలో పెద్దగా ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహించడం లేదని నాయకులే మాట్లాడుకుంటున్నారు.విజయవాడ సెంట్రల్ నుంచి ఇన్ఛార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కూడా పెద్దగా నోరు విప్పని పరిస్థితి ఉందనేది లోకల్ టాక్. మల్లాది విష్ణు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బోండా ఉమా సైతం ఆయన మీద పెద్దగా విమర్శలు చేయలేదన్న సంగతి గుర్తు చేసుకుంటున్నారు స్థానికులు. ఎన్నికల సమయంలో గద్దె రామ్మోహన్ పై అనేక విమర్శలు చేసిన తూర్పు నియోజకవర్గ ఇన్ఛార్జ్ దేవినేని అవినాష్ ఇప్పుడు జిల్లా అధ్యక్షుడు కావడంతో నియోజకవర్గం కంటే జిల్లా వ్యవహారాలపై ఫోకస్ పెడుతున్నారట. ఇక జగ్గయ్యపేటలో కొత్తగా ఇన్ఛార్జ్ పదవి పొందిన నాగేశ్వరరావు, తిరువూరు ఇన్ఛార్జ్ స్వామిదాస్ పనితీరు ఆశించిన స్థాయిలో లేదన్నది అధిష్టానం అభిప్రాయం. వీళ్ళందరి పనితీరుకు సంబంధించి స్థానికంగా ఉన్న నియోజకవర్గాల అబ్జర్వర్ల నుంచి నివేదికలు సేకరించిన అధిష్టానం?. సైలెంట్‌గా ఉన్న వాళ్ళని యాక్టివేట్ చేసేందుకు చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

# రైల్వే ఆస్పత్రికి దిక్కేది...

విజయవాడ ,మే1, (నూ

రైల్వే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ప్రాణాలకు రక్షణగా నిలవాల్సిన విజయవాడ రైల్వే డివిజనల్ ఆస్పత్రి ఇప్పుడు సమస్యల నిలయంగా మారింది. దక్షిణ మధ్య రైల్వేలో కీలకమైన ఈ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు కరువవ్వడంతో రోగులు, వృద్ధులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం పరాకాష్టకు చేరడంతో రైల్వే కుటుంబాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు ఎంత దారుణంగా ఉన్నాయంటే.. ఆపరేషన్ ముగిసిన తర్వాత రోగులను వార్డులకు తరలించడానికి కనీసం వీల్ చైర్లు, స్ట్రెచర్లు కూడా అందుబాటులో లేవు అనే ఆరోపణలు వినపడుతున్నాయి.ఆపరేషన్ థియేటర్ నుంచి నడుచుకుంటూనే వార్డులకు వెళ్లాలని నర్సింగ్ సిబ్బంది రోగులకు సూచిస్తుండటం కలకలం రేపుతోంది. ముఖ్యంగా వృద్ధులు, శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు నడవలేక నరకం చూస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల పట్ల ఇంతటి అమానవీయంగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం వేసవి ఎండలుమండిపోతున్న తరుణంలో ఆస్పత్రిలో కనీస తాగునీటి సౌకర్యం కూడా లేదు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న వాటర్ కూలర్లు చాలా కాలంగా మరమ్మతులకు గురై పని చేయడం లేదు.ఉక్కపోత, ఎండ వేడితో రోగులు అల్లాడుతుంటే.. కనీసం తాగడానికి చల్లని నీరు కూడా అందించలేకపోవడం అధికారుల అసమర్థతకు అద్దం పడుతోంది. వార్డుల్లో కనీస గాలి కూడా ఆడక రోగుల పరిస్థితి దారుణంగా తయారైంది. రైల్వే ఉద్యోగులు తమ వేతనం నుంచి నిరంతరం మెడికల్ ఫీజులు చెల్లిస్తున్నా, వారికి అందాల్సిన వైద్య సేవల్లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంలో రైల్వే ఉన్నతాధికారులు ఘోరంగా విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి. డివిజనల్ ఆస్పత్రిలో నెలకొన్న ఈ అధ్వాన్న పరిస్థితులపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన సౌకర్యాలు కల్పించాలని రైల్వే ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఏపీకి కేంద్రం భారీగా నిధులు...

విజయవాడ, మే 1,

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం మరోసారి తీపికబురు చెప్పింది.. మరోసారి భారీగా నిధులు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ.1,399 కోట్లు రిలీజ్ చేశారు. ఈ నిధుల్లో రూ.1,123 కోట్లు 2025-26 ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ బకాయిల కింద కేంద్రం ఇచ్చింది. మరో రూ.69 కోట్లు 2026-27 ఆర్థిక సంవత్సరం పరిపాలన ఖర్చుల కింద.. రెండు రోజుల మరో రూ.207 కోట్లను జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ కింద కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ విడుదల చేసింది. దీన్ దయాల్ అంత్యోదయ యోజన పథకం కింద 2026?27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 207 కోట్ల నిధులు మంజూరు చేశారు.కేంద్రం విడుదల చేసిన నిధులకు ఏపీ ప్రభుత్వం వాటా 25 శాతం దాదాపు రూ.374.38 కోట్లు కలిపి సుమారు రూ.1500 కోట్ల మెటీరియల్ నిధులు అకౌంట్లలో జమ చేయనున్నారు. ఈ మొత్తం నిధులతో ఉపాధిహామీ పథకం మెటీరియల్, పరిపాలనా వ్యవహారాల బకాయిలు చెల్లించనున్నారు. ఈ నిధులతో ముందుగా పాత బకాయిలు చెల్లించడానికి ప్రాధాన్యం ఇస్తారు. కేంద్రం నిధులు విడుదల చేయడంపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. నరేగా కింద 2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1192.16 కోట్ల నిధులు మంజూరు చేయడం ఆనందకరం. ఇందులో మెటీరియల్ కంపోనెంట్‌కు రూ. 1123.15 కోట్లు, అడ్మిన్ కంపోనెంట్‌కు రూ. 69.01 కోట్లు విడుదలయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు కృతజ్ఞతలు. ఈ నిధులు గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచి, మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడతాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఈ నిధులు ప్రతి గ్రామానికి చేరి, ఉపాధి, గౌరవం, అవకాశాలుగా మారుతున్నాయి' అంటూ కేంద్రమంత్రి పెమ్మసాని ట్వీట్ చేశారు.'వ్యవసాయానికి నీరు ప్రాణాధారం. చిఆఅ?ఖఓఖూజ 2.0 పథకం కింద 2026?27 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల కోసం ఆంధ్రప్రదేశ్‌కు ?24.23 కోట్ల నిధులు విడుదల కావడం సంతోషకరం. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గారు, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ నిధులు వాటర్‌షెడ్ అభివృద్ధి పనులకు వేగం తీసుకువచ్చి, నీటి సంరక్షణను బలోపేతం చేసి, గ్రామీణ రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వాతావరణ మార్పులకు తట్టుకునే స్థిరమైన వ్యవసాయానికి ఇది ఒక ముఖ్యమైన అడుగు' అన్నారు పెమ్మసాని.

================

# వరంగల్ లో బీఆర్ఎస్ రైతు సభ..

హైదరాబాద్ మే 1,

బీఆర్ఎస్ వరుసగా బహిరంగసభలు నిరవహించాలని అనుకుంటోంది. జీవన్ రెడ్డి చేరికసభ పార్టలో కొంత జోష్ నింపిందని అనుకుంటున్న ఆ పార్టీ హైకమాండ్ కొత్తగా వరంగల్ లో బహిరంగసభ నిర్వహించాలని ప్లాన్ చేసతోంది. దీనికి రైతు సభగా నామకరణం చేస్తున్నారు. రైతుల సమస్యలపై ఈ సభను నిర్వహిస్తారు. అయితే ఈ సభలకు కేసీఆర్ హాజరవుతారా లేదా అన్నది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.తెలంగాణ రాజకీయాల్లో తిరిగి పుంజుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధిష్టానం సరికొత్త కార్యాచరణకు సిద్ధమవుతోంది. జగిత్యాల నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరడం.. ఆ సందర్భంగా నిర్వహించిన సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇదే ఊపును కొనసాగించేందుకు వరంగల్ వేదికగా భారీ రైతు బహిరంగ సభ నిర్వహించేందుకు గులాబీ దళం ప్లాన్ చేస్తోంది. ఈ సభ ద్వారా అటు రైతు సమస్యలను ఎండగట్టడంతో పాటు, ఇటు పార్టీ క్యాడర్‌లో భరోసా నింపాలని హైకమాండ్ భావిస్తోంది.వరంగల్ సభకు సంబంధించి ఇప్పుడు అందరి దృష్టి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుపైనే ఉంది. నేరుగా గ్రౌండ్ లోకి దిగే రాజకీయాలు ఆయన చేయరు. గతంలోనూ చేయలేదు కానీ ఇప్పుడు పార్టీ వ్యవహారాలను రోజువారీగా కూడా పట్టించుకోవడంలేదు. పూర్తిగా కేటీఆర్‌కే అప్పగించారు. ఇప్పుడు ఎన్నికల మూడ్ వస్తున్నందున రైతుల రుణమాఫీ, కరువు పరిస్థితులు , ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగాలని పార్టీ నేతలు కోరుతున్నారు. వరంగల్ వంటి కీలక ప్రాంతంలో కేసీఆర్ గళం విప్పితే రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం మారుతుందని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని ప్రధాన అజెండాగా మార్చుకోవాలని బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా రైతు భరోసా అమలులో జాప్యం, పంట నష్టపరిహారం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం. ఒకవేళ కేసీఆర్ ఈ సభకు హాజరైతే, ఆయన చేసే ప్రసంగం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి టానిక్ లా పనిచేస్తుందని ద్వితీయ శ్రేణి నాయకత్వం నమ్ముతోంది. ఇప్పటికే వరంగల్ చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేసేందుకు కసరత్తు మొదలైందికవిత పార్టీ నుంచి వచ్చే ముప్పు తగ్గించుకోవడానికి పార్టీ నుంచి వలసలను అడ్డుకోవడానికి కూడా ఇలాంటి భారీ సభలు అవసరమని గులాబీ అగ్రనాయకత్వం భావిస్తోంది. పార్టీ ఇంకా బలంగానే ఉందని, కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని నిరూపించడమే ఈ సభ వెనుక ఉన్న మరో పరమార్థం. అయితే కేసీఆర్ ఎంత యాక్టివ్‌గా ఉంటే.. పార్టీ క్యాడర్‌లో అంత ఉత్సాహం వస్తుంది.

====================

# సింహపురిలో మహానాడు...

నెల్లూరు ,మే1,

తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరం మే నెలలో నిర్వహించే మహానాడు వేదికపై పార్టీ అధిష్టానం కీలక నిర్ణయం తీసుకుంది. తొలుత ఈ వార్షిక సభను ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించాలని భావించినప్పటికీ, తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేదికను నెల్లూరు జిల్లాకు మారుస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం మరియు ఎన్టీఆర్ జయంతిపురస్కరించుకుని ఈ మెగా ఈవెంట్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.వేదిక మార్పుకు ప్రధానంగా ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఒక కారణంగా కనిపిస్తోంది. జూన్ లేదా జూలై నెలల్లో ప్రధాని మోదీ ఉత్తరాంధ్రలో భారీ బహిరంగ సభలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఒకే ప్రాంతంలో తక్కువ వ్యవధిలో రెండు భారీ రాజకీయ సభలు నిర్వహించడం వల్ల జన సమీకరణ మరియు భద్రతా పరమైన ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన పార్టీ, వ్యూహాత్మకంగా వేదికను నెల్లూరుకు మార్చాలని నిర్ణయించింది. రాజకీయ పరంగా చూస్తే, నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించడం వెనుక టీడీపీ పెద్ద స్కెచ్ వేసినట్లు కనిపిస్తోంది.ఇటీవల నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్సీపీ అసమ్మతి నేతలు టీడీపీలో చేరడం, జిల్లాలో పార్టీకి పెరిగిన ఊపును మరింత పెంచడం ఈ నిర్ణయం వెనుక ఉన్న ఉద్దేశం. దక్షిణ కోస్తాలో పార్టీ కేడర్‌ను స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి సిద్ధం చేయడానికి ఈ వేదికను వాడుకోవాలని అధిష్టానం భావిస్తోంది. ప్రస్తుత పరిణామాల ప్రకారం, నెల్లూరులోని అనువైన ప్రదేశాలను పార్టీ ముఖ్య నేతలు ఇప్పటికే పరిశీలిస్తున్నారు. లక్షలాదిగా వచ్చే కార్యకర్తలు మరియు నాయకులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మైదానాలు, రవాణా సౌకర్యాలను జిల్లా నేతలు పర్యవేక్షిస్తున్నారు. జిల్లాల వారీగా 'మినీ మహానాడు'లు నిర్వహించి, చివరగా నెల్లూరులో జరిగే ప్రధాన మహానాడుతో పార్టీ శ్రేణుల్లో పూర్తిస్థాయిలో జోష్ నింపాలని చంద్రబాబు నాయుడు వ్యూహ రచన చేస్తున్నారు.


# వరంగల్ లో బీఆర్ఎస్ రైతు సభ..

హైదరాబాద్ మే 1,

బీఆర్ఎస్ వరుసగా బహిరంగసభలు నిరవహించాలని అనుకుంటోంది. జీవన్ రెడ్డి చేరికసభ పార్టలో కొంత జోష్ నింపిందని అనుకుంటున్న ఆ పార్టీ హైకమాండ్ కొత్తగా వరంగల్ లో బహిరంగసభ నిర్వహించాలని ప్లాన్ చేసతోంది. దీనికి రైతు సభగా నామకరణం చేస్తున్నారు. రైతుల సమస్యలపై ఈ సభను నిర్వహిస్తారు. అయితే ఈ సభలకు కేసీఆర్ హాజరవుతారా లేదా అన్నది ఇంకా సస్పెన్స్ గానే ఉంది.తెలంగాణ రాజకీయాల్లో తిరిగి పుంజుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధిష్టానం సరికొత్త కార్యాచరణకు సిద్ధమవుతోంది. జగిత్యాల నేత జీవన్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరడం.. ఆ సందర్భంగా నిర్వహించిన సభ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఇదే ఊపును కొనసాగించేందుకు వరంగల్ వేదికగా భారీ రైతు బహిరంగ సభ నిర్వహించేందుకు గులాబీ దళం ప్లాన్ చేస్తోంది. ఈ సభ ద్వారా అటు రైతు సమస్యలను ఎండగట్టడంతో పాటు, ఇటు పార్టీ క్యాడర్‌లో భరోసా నింపాలని హైకమాండ్ భావిస్తోంది.వరంగల్ సభకు సంబంధించి ఇప్పుడు అందరి దృష్టి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుపైనే ఉంది. నేరుగా గ్రౌండ్ లోకి దిగే రాజకీయాలు ఆయన చేయరు. గతంలోనూ చేయలేదు కానీ ఇప్పుడు పార్టీ వ్యవహారాలను రోజువారీగా కూడా పట్టించుకోవడంలేదు. పూర్తిగా కేటీఆర్‌కే అప్పగించారు. ఇప్పుడు ఎన్నికల మూడ్ వస్తున్నందున రైతుల రుణమాఫీ, కరువు పరిస్థితులు , ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగాలని పార్టీ నేతలు కోరుతున్నారు. వరంగల్ వంటి కీలక ప్రాంతంలో కేసీఆర్ గళం విప్పితే రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం మారుతుందని బీఆర్ఎస్ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి.రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న వ్యవసాయ సంక్షోభాన్ని ప్రధాన అజెండాగా మార్చుకోవాలని బీఆర్ఎస్ వ్యూహరచన చేస్తోంది. ముఖ్యంగా రైతు భరోసా అమలులో జాప్యం, పంట నష్టపరిహారం వంటి అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం. ఒకవేళ కేసీఆర్ ఈ సభకు హాజరైతే, ఆయన చేసే ప్రసంగం పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి టానిక్ లా పనిచేస్తుందని ద్వితీయ శ్రేణి నాయకత్వం నమ్ముతోంది. ఇప్పటికే వరంగల్ చుట్టుపక్కల జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ చేసేందుకు కసరత్తు మొదలైందికవిత పార్టీ నుంచి వచ్చే ముప్పు తగ్గించుకోవడానికి పార్టీ నుంచి వలసలను అడ్డుకోవడానికి కూడా ఇలాంటి భారీ సభలు అవసరమని గులాబీ అగ్రనాయకత్వం భావిస్తోంది. పార్టీ ఇంకా బలంగానే ఉందని, కేసీఆర్ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని నిరూపించడమే ఈ సభ వెనుక ఉన్న మరో పరమార్థం. అయితే కేసీఆర్ ఎంత యాక్టివ్‌గా ఉంటే.. పార్టీ క్యాడర్‌లో అంత ఉత్సాహం వస్తుంది.

====================


# సంజయ్ కపూర్ ఫ్యామిలీ రచ్చకెక్కిన ఆస్తుల వివాదం

ముంబై, మే 1,

గత ఏడాది జూన్‌లో లండన్‌లో పోలో ఆడుతూ మరణించిన వ్యాపారవేత్త సంజయ్ కపూర్ రూ. 30,000 కోట్ల విలువైన వారసత్వ ఆస్తి వివాదంపై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు వెలువరించింది. వ్యాపారవేత్త సంజయ్ కపూర్ ఆస్తులను పరిరక్షించాలని ఆదేశించింది. రెండో భార్య నటి కరిష్మా కపూర్ సంతానం పిల్లలు కియాన్, సమైరా కపూర్‌లకు.. ఆయన మూడో భార్య ప్రియా సచ్‌దేవా కపూర్‌కు మధ్య వివాదం నెలకున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. సంజయ్ కపూర్ పేరు మీద ఉన్న వీలునామాను ప్రియా కపూర్ ఫోర్జరీ చేశారని, అలాగే ఆస్తుల పూర్తి జాబితాను వెల్లడించలేదని కియాన్, సమైరా ఆరోపించారు. ఆ జాబితాలో పోలో కోసం ఉపయోగించే ఖరీదైన గుర్రాలు, రోలెక్స్ వంటి బ్రాండ్‌లకు చెందిన చేతి గడియారాలు లేవని వారు పేర్కొన్నారు.కపూర్ కుటుంబ ఆస్తులలో భాగమైన సంజయ్ కపూర్‌కు చెందిన అనేక స్థిరాస్తులు, విలువైన పెయింటింగ్‌లు ప్రియా కపూర్ కోర్టుకు సమర్పించిన జాబితాలో చేర్చలేదని కూడా ఆ పిల్లలు పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. సంజయ్ కపూర్ ఆస్తులను పరిరక్షించాలని, వాటిని దుర్వినియోగం చేయకూడదని ఆదేశించింది. అంతేకాదు, ప్రియా కపూర్ వాటిని అమ్మకుండా నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. బ్యాంకు ఖాతాల నిర్వహణను కూడా కోర్టు నిలిపివేసింది.అంతేకాదు, వీలునామాపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రియా కపూర్‌పై ఉందని కోర్టు స్పష్టం చేసింది. రెండో భార్య కరిష్మా కపూర్ పిల్లలు ఇప్పటికే కేసులో ప్రాథమిక ఆధారాలను అందించారని, ఒకవేళ ఎలాంటి చర్య తీసుకోకుండా ఉండి, ఆ తర్వాత వీలునామా నకిలీదని తేలితే అది 'అన్యాయం' అవుతుందని కోర్టు తెలిపింది. ఇక, ప్రియా కపూర్, సంజయ్ కపూర్ తల్లి రాణి కపూర్, సోదరి మందిరా కపూర్‌ల మధ్య కూడా ఆస్తి వివాదం ఉన్న సంగతి తెలిసిందే.ఇక, 53 ఏళ్ల సంజయ్ కపూర్ గత ఏడాది జూన్ 12న లండన్‌లో పోలో ఆడుతూ మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణానికి గుండెపోటు కారణమని తొలుత పేర్కొన్నప్పటికీ, అనాఫిలాక్టిక్ షాక్ తగిలినట్లు కూడా నివేదికలు వచ్చాయి. దీని వెనుక కుట్ర ఉందని తల్లి రాణి కపూర్ అనుమానం వ్యక్తం చేశారు. కానీ, గుండె జబ్బును కారణంగా చూపుతూ ఆయనది సహజ మరణమేనని బ్రిటిష్ వైద్య అధికారులు ధ్రువీకరించారు. అయితే, సంజయ్ మరణం తర్వాత ప్రియా సచదేవ్ కపూర్‌లో సోనా కామ్‌స్టార్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించడం వివాదాస్పదమైంది.

# ఆర్టీసీ బస్ డిపో లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే వేడుకలు
## ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ మే 1,

హుస్నాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్ఆర్టీసీ కార్మికులతో కలిసి మే డే వేడుకలు జరుపుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, ఆర్టీసీ ఈడి సోలమన్, కౌన్సిలర్ లు,ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, ఏసిపి సదానందం,ఆర్టీసీ కార్మికులు.మేడే వేడుకల్లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించిన సభ.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి ప్రపంచ కార్మికులకు శ్రమైక జీవులకు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు.మేడే ను హుస్నాబాద్ ఆర్టీసీ డిపో లో జరుపుకుంటున్నాంప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహా లక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం.మీ సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రి గా ప్రభుత్వానికి వారధి గా ఉంటా.

# మౌనంగా ఓటర్లు....

కోల్ కత్తా, మే 1,

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల చివరి దశ పోలింగ్ ముగిసిన అనంతరం పలు సంస్థలు ఎగ్జిట్ పోల్ అంచనాలను విడుదల చేశాయి. ఈ పోల్స్ ఎన్నికల ఫలితంపై భిన్నాభిప్రాయాలను వెల్లడించాయి. కొన్ని సర్వేలు పశ్చిమ్ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని అంచనా వేయగా.. మరికొన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారాన్ని నిలబెట్టుకుంటుందని జోస్యం చెప్పారు. అయితే, ప్రముఖ సంస్థ మాత్రం ఇప్పటివరకు తన అంచనాలను వెల్లడించలేదు. తమకు తగినంత ప్రాతినిధ్య నమూనా లభించకపోవడంతో పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన ఎగ్జిట్ పోల్ డేటాను విడుదల చేయబోమని యాక్సిస్ మై ఇండియా ప్రకటించింది.ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో యాక్సిస్ మై ఇండియా సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ గుప్తా మాట్లాడుతూ.. తమ సర్వేకు ఓటర్లు స్పందించడం లేదని చెప్పారు. " యాక్సిస్ మై ఇండియా అనుసరించే పద్ధతి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడటం. మొదటి దశ తర్వాత మేము వారితో మాట్లాడటానికి ప్రయత్నించగా సుమారు 60-70 శాతం మంది మౌనంగా ఉన్నారు.. వారు అవును, కాదు అని చెప్పడానికి కూడా సిద్ధంగా లేరు" అని గుప్తా తెలిపారు."ఎన్నికల నేపథ్యంలో ఎవరూ ఎవరితోనూ మాట్లాడటానికి సిద్ధంగా లేరు. కాబట్టి, మా నమూనా ప్రాతినిధ్యం వహించనంత కాలం 20-30 శాతం నమూనా ఆధారంగా ఏ సంఖ్యనైనా అంచనా వేయడం సరైనదని మేము భావించడం లేదు. దాని కోసం, మేము గురువారం మరోసారి ప్రయత్నిస్తాం.. బహుశా ఇప్పుడు ఎన్నికలు జరిగాయి కాబట్టి ప్రజలు మరింత ప్రశాంతంగా ఉంటారు" అని ఆయన అన్నారు. గురువారం కూడా బెంగాల్ ఎగ్జిట్ పోల్స్‌ను తాము విడుదల చేయడం లేదని గుప్తా ఉద్ఘాటించారు'నాకు ఎలాంటి అభిప్రాయం లేదు.. ఎందుకంటే ఎవరూ మాట్లాడనప్పుడు నా పరిమితులు తొలగిపోతాయి' అని గుప్తా అన్నారు. 'ఉత్తమంగా ప్రయత్నించడం నా అలవాటు.

మేము ఇన్ని రోజులుగా తీవ్రంగా ప్రయత్నించి, చెమటోడ్చాం... ఎంతో కాలంగా మేము కష్టపడుతూనే ఉన్నాం... ఇంతగా కృషిచేసిన తర్వాత కూడా మేము అంచనా వేయలేకపోతే మాకు నిరాశ కలిగిస్తుంది' అని అన్నారు.మొత్తం 294 స్థానాలున్న పశ్చిమ్ బెంగాల్‌లో అధికారం చేపట్టాలంటే సాధారణ మెజార్టీ 148. ఈ మ్యాజిక్ ఫిగర్‌ను ఎవరు సాధిస్తారో మే 4న తేలిపోనుంది. రెండు దశల్లో జరిగిన బెంగాల్ ఎన్నికల్లో 92 శాతానికిపైగా పోలింగ్ నమోదయ్యింది. స్వాతంత్ర్యం తర్వాత ఆ రాష్ట్రంలో నమోదయిన అత్యధిక శాతం పోలింగ్ ఇదే. అయితే, కొన్ని సర్వేలు బీజేపీకి (ప్రజా పోల్ 178 నుంచి 208, మాట్రిజ్ పోల్ డైరీ 161 నుంచి 171), తృణమూల్ కాంగ్రెస్‌కు (జన్మత్ 195 నుంచి 205, పీపుల్స్ పల్స్ 177 నుంచి 187) అనుకూలంగా ఉంటాయని చెప్పాయి.

# చెన్నైలో హంగ్ లెక్కలు
## సీఎం ఎవరనే అంశంపై బెట్టింగ్స్

చెన్నై, మే 1, ( తమిళనాడులో గందరగోళ ఎగ్జిట్ పోల్స్ తో మధ్యేమార్గంగా హంగ్ వస్తుందని అందరూ ఫీలవుతున్నారు. టీవీకే, అన్నాడీఎంకే కూడా అదే నిర్ణయానికి వచ్చి తెర వెనుక చర్చలు ప్రారంభించాయి. ముఖ్యంగా అధికార డిఎంకె కూటమికి, అన్నాడీఎంకే కూటమికి మధ్య గట్టి పోటీ ఉండటంతో పాటు, తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం నిర్ణయాత్మక శక్తిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే , విజయ్ పార్టీ టీవీకే మధ్య తెరవెనుక రాయబారాలు మొదలైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం కోసం ఈ రెండు పార్టీలు చేతులు కలిపేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎగ్జిట్ పోల్స్ గందరగోళంగా ఉన్నప్పటికీ, అన్నాడీఎంకే , టీవీకే కలిస్తే అధికారం చేపట్టేందుకు సరిపడా నంబర్స్ వస్తాయని ఆయా పార్టీల నేతలు లెక్కలు వేసుకుంటున్నారు. ఫలితాల అనంతరం సంక్లిష్ట పరిస్థితి తలెత్తితే సమయం వృథా చేయకుండా వెంటనే కార్యాచరణలోకి దిగాలని ఇరు పార్టీల అగ్రనాయకత్వం భావిస్తోంది.ఈ పొత్తులో అత్యంత కీలకమైన అంశం ముఖ్యమంత్రి పదవి . విజయ్ తనను తాను సీఎం అభ్యర్థిగా ప్రకటించుకోగా, అన్నాడీఎంకే తరపున పళనిస్వామి రేసులో ఉన్నారు. ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి ఇరు పార్టీల మధ్య ఒక మధ్యేమార్గంపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తే, ఆ పార్టీకే సీఎం పదవి దక్కాలని, రెండో పెద్ద పార్టీకి డిప్యూటీ సీఎం పదవితో పాటు కీలక శాఖలు కేటాయించాలని ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అధికారాన్ని పంచుకోవడం ద్వారా డిఎంకెను అడ్డుకోవచ్చనేది వీరి ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది.ప్రస్తుతానికి ఇవన్నీ ప్రాథమిక చర్చలు , ఊహాగానాలే. మే 4న వెలువడే అసలు ఫలితాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమై హంగ్ ఏర్పడితే మాత్రం తమిళ రాజకీయం మలుపులు తిరగడం ఖాయం. ఒకవేళ టీవీకే ఊహించిన దానికంటే ఎక్కువ సీట్లు సాధిస్తే విజయ్ సీఎం పదవికి పట్టుబట్టే అవకాశం ఉంది, అదే సమయంలో అన్నాడీఎంకే తన పాత వైభవాన్ని చాటుకుంటే పళనిస్వామి పట్టు సడలించేలా లేరు కౌంటింగ్ తర్వాత వచ్చే నంబర్ గేమ్ ఆధారంగానే తమిళనాడు తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేది తేలనుంది.

# మెదక్ లో ప్రోటోకాల్ రచ్చ

మెదక్, మే1,

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ పాగా వేసింది. ఇక 2014 నుంచి బీఆర్ఎస్ వరుసగా గెలిచి హ్యాట్రిక్ కొట్టింది. ప్రస్తుతం కారు పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి. కానీ?. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో?.ఇక్కడ తరచూ ప్రోటోకాల్ వివాదాలు రేగుతున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఇతర నియోజకవర్గాల్లో ఇలాంటి గొడవలు పెద్దగా లేకున్నా?.నర్సాపూర్‌లో మాత్రం రచ్చో రచ్చస్య అన్నట్టుగా ఉంటోందట. రెండేళ్ల క్రితం అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ నియోజకవర్గంలో బడిబాట కార్యక్రమానికి వచ్చారు.అప్పుడు కాంగ్రెస్ ఇన్చార్జ్ రాజిరెడ్డికి స్కూల్ లో ఓ రూమ్‌కి రిబ్బన్ కట్‌చేసే అవకాశాన్ని మంత్రి సురేఖ ఇవ్వడాన్ని ఎమ్మెల్యే సునీత వ్యతిరేకించారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని రాజిరెడ్డితో క్లాస్ రూమ్ ఎలా ఓపెనింగ్ చేయిస్తారన్నది ఎమ్మెల్యే అభ్యంతరం. ఆ సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. ఆ తర్వాత కూడా ప్రతి సందర్భంలో ఎక్కడో ఒకచోట ప్రోటోకాల్ రగడ నడుస్తూనే ఉంది. ఇక తాజాగా ఇన్చార్జ్ మంత్రి వివేక్ నర్సాపూర్ పర్యటనలో ప్రోటోకాల్ వివాదం చినికి చినికి గాలి వానలా మారింది. నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదన్న ఎమ్మెల్యే వాదనతో రచ్చ జరిగింది. గతంలో ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశారామె. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలోనూ ప్రోటోకాల్ అంశంతో మొదలైన గొడవ చివరికి రాజకీయ విమర్శల వరకు వెళ్లింది. దీంతో ఇప్పుడు నియోజకవర్గంలోని అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించాలంటేనే హడలిపోతున్నారట.ఏ కార్యక్రమంలో ఏమవుతుందోనని ఆందోళన పెరుగుతోంది. మంత్రి వివేక్, ఎమ్మెల్యే సునీత వర్గాల మధ్య గొడవ జరిగినప్పుడు జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ రంగంలోకి దిగి నేతలకు నచ్చజెప్పేందుకు యత్నించినా ఫలితం లేదంటే సమస్య ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అంటున్నారు పరిశీలకులు. అయితే ప్రోటోకాల్ సమస్యపై ఎమ్మెల్యే సునీత చేస్తున్న పోరాటం కరెక్టేనన్నది బీఆర్ఎస్ వెర్షన్. కానీ? కాంగ్రెస్ నాయకులు మాత్రం ఎమ్మెల్యే వైఖరిని తప్పుపడుతున్నారు. మంత్రి మాట్లాడుతుంటే? మధ్యలో ఓ ప్రజాప్రతినిధి కలగజేసుకుని కార్యక్రమాన్ని డిస్టర్బ్ చేయడమేంటని ప్రశ్నిస్తున్నారు అధికార పార్టీ నాయకులు. మంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి ఎమ్మెల్యే ఇచ్చే గౌరవం ఇదేనా అని కౌంటర్ ఇస్తున్నారు. ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే సమయంలో తాము ఏమీ అనలేదని?ఆమె అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తుంటే అంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముందన్నది కాంగ్రెస్ వాదన.గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో? ఎంత మాత్రం ప్రోటోకాల్ పాటించారో? సునీతా లక్ష్మారెడ్డి ఒక్కసారి గుర్తుకు తెచ్చుకుంటే మంచిదన్నది కాంగ్రెస్ వెర్షన్. నర్సాపూర్ నియోజకవర్గంలో పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన స్థానాలు సాధించడం, ఎమ్మెల్యే స్వగ్రామం గోమారంలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థే సర్పంచ్ గా గెలవడం, మున్సిపల్ ఎన్నికల్లోనూ నర్సాపూర్ మున్సిపాలిటీని అధికార పార్టీ కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యే సునీత ఫ్రస్టేషన్‌లో ఉన్నారంటూ ప్రచారం చేస్తోంది కాంగ్రెస్. తాను కాంగ్రెస్‌ను వీడిన తర్వాత బలహీనంగా కనిపించిన పార్టీ క్యాడర్? ఆవుల రాజిరెడ్డి రాక తర్వాత బలపడటాన్ని ఆమె జీర్ణించుకలేకపోతోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు హస్తం నేతలు. నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కంటే అధికారులు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డికే ప్రాధాన్యం ఇస్తున్నారట. ఈ పరిస్థితుల్లో ప్రోటోకాల్ రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదని అంటున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాల కోసం మంత్రులు వచ్చిన ప్రతిసారి గొడవ జరగడం కామన్ అయిపోతోంది. దీంతో?అఫీషియల్ ప్రోగ్రామ్స్ అంటేనే హడలిపోతున్నారట ప్రభుత్వ అధికారులు.

# బిస్వాంత్ శర్మని గాయపరిచిన ఘటన అదేనా

గౌహతి, మే 1,

అస్సాం రాజకీయ ముఖచిత్రంపై హిమంత బిశ్వ శర్మ అనే పేరు ఇప్పుడు ఒక తిరుగులేని శక్తిగా మారింది. 2026 అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూస్తుంటే, అస్సాంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి కోలుకోలేని దెబ్బ తిన్నట్లు కనిపిస్తోంది. ఒకప్పుడు కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉండి, నేడు బీజేపీని వరుసగా మూడోసారి అధికారంలోకి తీసుకువస్తున్న హిమంత ప్రస్థానం భారత రాజకీయాల్లోనే ఒక అరుదైన అధ్యాయం.హిమంత బిశ్వ శర్మ రాజకీయ జీవితంలో 2015వ సంవత్సరం అత్యంత కీలకమైనది. కాంగ్రెస్ పార్టీలో ఉండగా అస్సాం సమస్యలపై చర్చించేందుకు రాహుల్ గాంధీని కలిసినప్పుడు .. రాహుల్ గాంధీ వారి మాటలు వినకుండా తన పెంపుడు కుక్క కి బిస్కెట్లు వేయడంలో నిమగ్నమయ్యారు. కుక్కలకు బిస్కెట్లు వేస్తున్న అదే ప్లేటులో ఉన్న బిస్కెట్లను అస్సాం నేతలకు కూడా ఆఫర్ చేశారు. ఇది హిమంత ఆత్మాభిమానాన్ని దెబ్బతీసింది. దెబ్బతిన్న ఆ క్షణమే కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన ఆయన, ఈరోజు అస్సాంలో కాంగ్రెస్ ఉనికినే ప్రశ్నార్థకం చేశారు.తాజా ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, అస్సాంలోని 126 స్థానాలకు గాను బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి 88 నుండి 100 వరకు స్థానాలు లభించే అవకాశం ఉంది. ఒక్కటంటే ఒక్కటి కూడా కాంగ్రెస్ కూటమి గెలుస్తుందని అంచనా వేయలేదు. సర్వే సంస్థలన్నీ హిమంత బిశ్వ శర్మ మేజిక్‌ను ధ్రువీకరిస్తున్నాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కేవలం 25-35 స్థానాలకే పరిమితం కాబోతోందని అంచనా. మ్యాజిక్ ఫిగర్ 64ను బీజేపీ కూటమి సునాయాసంగా దాటడమే కాకుండా, దాదాపు మూడింట రెండు వంతుల మెజారిటీ దిశగా దూసుకుపోతోంది.హిమంత బిశ్వ శర్మ కేవలం ముఖ్యమంత్రిగానే కాకుండా, పార్టీకి ఒక ప్రధాన వ్యూహకర్తగా మారారు. అస్సాం గుర్తింపు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను మేళవించి ఆయన వేసిన వ్యూహాలు ప్రతిపక్షాల దగ్గర సమాధానం లేకుండా చేశాయి. పదేళ్ల నుంచి సీఎంగా ఉన్నా ఇప్పటికీ అధికార వ్యతిరేకత రాలేదు. మహిళలు, యువత మద్దతు హిమంతకే ఉండటం బీజేపీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. రాహుల్ గాంధీ కుక్క బిస్కెట్ల వ్యవహారాన్ని ప్రతి ఎన్నికలోనూ గుర్తు చేస్తూ, తన ఆత్మాభిమానాన్ని అస్సాం ఆత్మాభిమానంగా మార్చడంలో ఆయన సక్సెస్ అయ్యారు.ఒకప్పుడు అస్సాంను ఏకధాటిగా పాలించిన కాంగ్రెస్, ఇప్పుడు గౌరవ్ గొగోయ్ వంటి యువ నాయకత్వం ఉన్నప్పటికీ హిమంత ధాటికి నిలవలేకపోయింది. ముస్లిం ఓట్ల చీలిక, సరైన వ్యూహం లేకపోవడం కాంగ్రెస్‌ను ముంచేశాయి. ఎగ్జిట్ పోల్స్ నిజమైతే, అస్సాం మట్టిలో పుట్టి, అవమానాన్ని ఎదుర్కొని ..దానికి ప్రతీకారంగా కాంగ్రెస్ పార్టీని బొందపెడుతున్న నేతగా ఆయన గుర్తింపు సాధించుకుంటారు.

# నష్టనివారణ చర్యల్లో మంగ్లీ

హైదరాబాద్ ,మే1,

సింగర్ మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు ప్రకంపనలు రేపుతూనే ఉంది. బాధితులు రోడ్డెక్కుతుండటం, బాధితుల తరపున గిరిజన సంఘాల నేతలు పోరాటం చేస్తుండటం మరింత హీట్ పెంచుతోంది. అయితే.. తనపై వస్తున్న ఆరోపణలపై మంగ్లీ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. మైక్రో ఫైనాన్స్ బాధితులకు అన్యాయం జరిగిందన్న మంగ్లీ..బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ప్రకటించారు. కొందరు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని.. ఈ ఆర్థిక మోసంలో తనకుఎ ఎలాంటి ప్రమేయం లేదని చెప్పుకొచ్చారు.. ఈ సమయంలోనే.. తనపై పెట్టిన కేసుపై మరోసారి మంగ్లీ స్పందించారు. రమావత్ మధుపై విరుచుకుపడిన సింగర్ మంగ్లీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. దుర్మార్గుడు అని తెలియక మాట్లాడిన పాపానికి.. పట్టుబడితే నా బ్యాండ్‌తో కలిసి ఇంటికెళ్లి భోజనం చేశానన్నారు. ఒకపూట భోజనం చేసిన పాపానికి క్షోభ అనుభవిస్తున్నా.. అంటూ పేర్కొన్నారు.కొందరు కావాలనే ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని మంగ్లీ పేర్కొన్నారు. ఏ ఆధారాలు లేకుండా తన చుట్టూ కుట్రలు పన్నుతున్నారని.. రమావత్ మధు చేసిన మోసాల్లో తనకు 1శాతంకూడా సంబంధం లేదన్నారు. ప్రజల్ని మోసం చేసి రక్తపు కూడు తినే మనిషిని కాదన్నారు. తన కుటుంబ సభ్యులకూ ఈ మోసంతో సంబంధం లేదన్నారు. బండి శివ పేరుని తన తమ్ముడు శివచౌహాన్‌గా ప్రచారం చేస్తున్నారన్నారు. పదే పదే అబద్దాన్ని వందసార్లు చెప్పి నిజం చేయాలనుకుంటున్నారని.. తాను.. తన కుటుంబ సభ్యులు ఎక్కడికీ పారిపోలేదని పేర్కొన్నారు. అంతిమంగా నిజమే గెలుస్తుంది అంటూ మంగ్లీ నోట్ విడుదల చేశారు.



ఇటీవల ఈ ఫ్రాడ్ కేసు బాధితుడు నల్గొండ జిల్లా పెద్దవూరకు చెందిన పాల్తి రమేష్ అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో మంగ్లీ నోట్ విడుదల చేసింది. రమావత్ మధు బాధితుడిగా అభివర్ణిస్తూ మంగ్లీ తాను విడుదల చేసి నోట్‌లో రాసుకొచ్చింది. ఆయన మృతి బాధాకరమని చెబుతోంది మంగ్లీమరోవైపు మైక్రో ఫైనాన్స్ స్కామ్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్.. మంగ్లీపై కుట్రపూరితంగానే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. అడ్వొకేట్ సుబ్బారావు ఆరోపణలు నిరాధారమన్నారు. ఈ కేసులో వాస్తవాలు ఏంటనేది పోలీసు విచారణలో తేలుతాయన్నారు. తమపై నిరాధార ఆరోపణలు చేసిన వాళ్లకు చట్టపరంగానే సమాధానమిస్తామని అంటున్నారు మంగ్లీ సోదరుడు శివ చౌహాన్..

# తెలంగాణపై బీజేపీ నజర్

హైదరాబాద్ ,మే1,



తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈ సభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికి పరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగాణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకు కమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

# లీస్ట్, లాస్ట్ హైదరాబాదే...

హైదరాబాద్ ,మే1,

తెలంగాణ రాష్ట్ర పదో తరగతి ఫలితాల్లో రాజధాని హైదరాబాద్ జిల్లా తన ఉనికిని కోల్పోయి చిట్టచివరి స్థానానికి పడిపోయింది. బుధవారం విడుదలైన ఫలితాల ప్రకారం గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాలు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోయాయి. గతేడాది 30వ స్థానంలో ఉన్న హైదరాబాద్ జిల్లా, ఈసారి మరో మూడు స్థానాలు దిగజారి 33వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. రంగారెడ్డి జిల్లా 31 నుంచి 30వ స్థానానికి చేరుకోగా, మేడ్చల్ జిల్లా మాత్రం 28 నుంచి 24వ స్థానానికి మెరుగుపడి కొంత పరువు దక్కించుకుంది. హైదరాబాద్‌ను టాప్ టెన్ జాబితాలోకి తెస్తామన్న విద్యాశాఖ అధికారుల ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వస్తున్నాయిఈ ఏడాది ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుండి మొత్తం 1.76 లక్షల మంది పరీక్షలు రాయగా, అధిక సంఖ్యలో బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 96 శాతానికి పైగా విద్యార్థినులు పాస్ అవ్వగా, రంగారెడ్డిలో 94.78 శాతం, హైదరాబాద్‌లో 91.40 శాతం మంది విద్యార్థినులు విజయం సాధించారు. గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం మెరుగైనప్పటికీ, ఇతర జిల్లాలతో పోటీ పడటంలో ఇక్కడి విద్యార్థులు వెనుకబడ్డారు. రాజ్‌భవన్ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచారు.జిల్లాల వారీగా 2026 ఫలితాలను పరిశీలిస్తే, మేడ్చల్ జిల్లా 95.24 శాతం ఉత్తీర్ణతతో 24వ స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లా 92.96 శాతంతో 30వ స్థానంలో ఉండగా, హైదరాబాద్ జిల్లా 89.23 శాతంతో 33వ స్థానానికి పరిమితమైంది. విద్యా సంవత్సరం ప్రారంభం నుండి విద్యార్థుల చదువులపై శ్రద్ధ చూపడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ లోపించడం, కేవలం సమీక్షలకే పరిమితమవ్వడం వల్ల ఈ దారుణ ఫలితాలు వచ్చాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు విద్యాశాఖలో అక్రమ బదిలీలు, సిఫార్సుల ప్రభావం కూడా ఫలితాలపై పడిందని తెలుస్తోంది. కొంతమంది ఉపాధ్యాయులు రాజకీయ సిఫార్సులతో నగరంలోని ఉన్నత పాఠశాలలకు బదిలీపై వచ్చి, బోధన కంటే ఇతర అంశాలపైనే దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్ జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సరిగ్గా హాజరు కాకపోయినా అధికారులు పట్టించుకోలేదని, ప్రైవేటు పాఠశాలలపై ఉన్న ఆసక్తిని ప్రభుత్వ బడులపై చూపడం లేదని ఫలితాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

# కమలంలో ఆగని కుమ్ములాటలు

కరీంనగర్ ,మే1,తెలంగాణ బీజేపీ నేతల తీరును సొంత పార్టీ కేడరే ఎండగడుతోంది. వ్యక్తిగతంగా వాళ్ళకు అక్కడ పదవులతో పని లేకున్నా? పార్టీని అధికారంలో నిలపాలన్న తాపత్రయంతో పెద్దోళ్ళంతా అలా కష్టపడుతున్నారు. కానీ?. ఇక్కడ తెలంగాణలో పార్టీని నిలిపి గెలిపిస్తే? ముఖ్యమంత్రి నుంచి మంత్రి పదవుల దాకా? వీళ్ళకే కదా? వస్తాయి, అయినా సరే? రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు నిర్లిప్తంగా ఉంటున్నారు, కనీస యాక్టివిటీ కూడా ఎందుకు ఉండటం లేదని కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో చర్చ జరుగుతోంది. పైగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడుతున్నారు. ఇక్కడ పార్టీని గెలిపిస్తే? తమకు పదవులు వస్తాయని తెలిసి కూడా ఇగోకి పోతూ? ఉన్న అవాకాశాలను కూడా ఉపయోగించుకోవడం లేదని అంటున్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా? కమలంలోని పెద్దలు అక్కడ వాలిపోతారు.గెలుపు కోసం విస్తృత ప్రచారం చేస్తారు. అక్కడి కేడర్‌లో భరోసా నింపే ప్రయత్నం చేస్తారు. ఆ రూపంలో పార్టీకి ఊపు వస్తుంది. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జరుగుతోంది కూడా ఇదే. ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా?బెంగాల్‌లో గెలుపును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే చెప్పులరిగేలా తీరుగుతున్నారని చెప్పుకోవచ్చు. బీజేపీకి చెందిన మిగతా అగ్ర నాయకులు కూడా అదే స్థాయి ఫోకస్ పెట్టారు. సరిగ్గా ఈ పాయింట్‌నే లేవనెత్తుతూ తెలంగాణ బీజేపీ నాయకులు వాళ్లని చూసి ఎప్పుడు నేర్చుకుంటారంటూ డిస్కస్ చేసుకుంటున్నారు కింది స్థాయిలో. బెంగాల్‌లో గెలిస్తే?పార్టీ ఖాతాలోకి మరో రాష్ట్రం వస్తుంది. అంతే తప్ప? నేషనల్ లీడర్స్ అందరికీ అక్కడేం పదవులు రావు, ప్రత్యేకంగా ఒరిగేదేం లేదు. అయినా సరే వాళ్ళంతా అంత కష్టపడుతుంటే? ఇక్కడ మాత్రం ముఖ్యమంత్రి పీఠం సహా? రకరకాల పదవులు రాష్ట్ర నేతలకే దక్కే అవకాశం ఉన్నా? ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారంటూ ఫైరైపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో పాగా వేయాలని పెద్దవాళ్ళు పడుతున్న తాపత్రయం? తిరుగుతున్న తీరు? తెలంగాణ నేతలకు కనిపించడం లేదా అన్న ప్రశ్న వస్తోంది కేడర్ నుంచి. వాళ్లని చూసైనా?. మా నాయకులు ఇగోలు పక్కన పెట్టాలని అంటున్నారు. పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేస్తున్న నేషనల్ లీడర్స్‌కు, పార్టీ కన్నా మేమే గొప్ప అనుకుంటున్న స్టేట్ నాయకులకు చాలా తేడా ఉందని, ఆ సంగతి గమనించుకుని ఇకనైనా రాష్ట్ర పార్టీ నాయకులు మారితేనే తెలంగాణలో వాళ్ళకైనా, పార్టీకైనా భవిష్యత్ అన్నది కార్యకర్తల మాట. క్షేత్ర స్థాయిలో పని చేయడానికి మేం సిద్ధంగా ఉన్నా?నడిపించడానికి వాళ్లు రెడీగా లేరు, ఆ ఇగోలతో ఎన్నాళ్లని నడిపిస్తారని సొంతోళ్ళే మాట్లాడుకుంటున్నారు. మారండయ్యా?.. ఇకనైనా మారిపోండయ్యా?.. పై వాళ్ళని చూసి నేర్చుకోండయ్యా?.. అంటున్న తెలంగాణ బీజేపీ కార్యకర్తల మాటను రాష్ట్ర నాయకులు ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటారో చూడాలి.

# మే డే సందర్భంగా పిడిఎస్ బియ్యం గోదాంలో ఘనంగా జెండా ఆవిష్కరణ చేసిన హమాలీలు



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 01 (భారత శక్తి ) అధ్యక్షులు నృత్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏఐటీసీయూ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. కార్మిక దినోత్సవం 141వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, హమాలీలు ఐక్యంగా చేరి తమ హక్కులు, కష్టాల గురించి చర్చించుకున్నారు.కార్యక్రమం సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం కార్మిక నాయకులు ప్రసంగిస్తూ, కార్మికుల ఐక్యత ఎంతో ముఖ్యమని, వారి సంక్షేమం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో కార్మికులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మొత్తంగా ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగి, కార్మికుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# ప్రపంచీకరణ పేరుతో కాలగర్భంలో కార్మికుల హక్కులు

**-నీలి చట్టాల రాకతో ప్రపంచ శ్రామికుల హక్కులు ఎప్పుడో ఆవిరై పాయె**

**-ఎటు చూసినా కాంట్రాక్టు పద్ధతే నలిగి పోతున్నా కార్మిక శ్రామిక లోకం**

**-ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ నర్సాపూర్ నియోజకవర్గం కన్వీనర్ పోతరాజు బిక్షపతి.**

మెదక్ జిల్లా, మే 01 ( భారత శక్తి న్యూస్):



శ్రమ దోపిడీ,, ఓవర్ టైమ్ డ్యూటీ, పౌర నిదులే గాని, పౌర హక్కులను ఎప్పుడో కాల్చి బూడిద చేశారు. ఈ సభ్య సమాజం, ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప ఎవరికీ హక్కులు లేవు, శ్రమకు తగ్గ ఫలితం లేదు, నలిగి పోతున్న కార్మిక మిత్రులు కార్మికుల హక్కులను తుంగలో తొక్కి వాళ్ళ శ్రమతో ఆడుకుంటున్న కాంట్రాక్టర్లు కంపెనీ కానీ బట్టల షాప్ లు గానీ కిరాణా షాప్ లు గానీ, కొత్త ఇండ్ల గుత్తే దారులు గాని, బయట చూడానికి గేట్లు, శెటర్లు మూసివేత లోపల మాత్రం కార్మికులతో పని చేపించుకోవడం ఇది కదా మేడే అంటే కార్మికుల హక్కులని కాలరాస్తున్న యజమాన్యలపై తగు చర్యలు తీస్కోవాలి. కార్మిక చట్టాలని కాపాడాలి కార్మికుల చట్టాలతో నిర్లక్ష్యం వహిస్తే కార్మికులతో కలసి పోరాటం చేస్తాం కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.

# ఉపాధి హామీ పని చేసిన మంత్రి - కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



వెంకటాపూర్/ములుగు జిల్లా ప్రతినిధి, మే 01 (భారత శక్తి):ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశాపూర్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి కూలీలతో కలిసి పలుగు, పార చేతబట్టి పనిలో పాల్గొని వారితో అనుబంధాన్ని పంచుకున్నారు. కూలీల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ వారి పనితీరును అభినందించారు.అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి, తీవ్ర ఎండల నేపథ్యంలో ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.తగినంత నీరు తాగడం,విరామాలు తీసుకోవడం, అవసరమైన రక్షణ చర్యలు పాటించడం వంటి అంశాలను వివరించారు.కూలీలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూలీలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో ఘనంగా మేడే ఉత్సవాలు

ములుగు జిల్లా ప్రతినిధి, మే 01 (భారత శక్తి): జిల్లా కలెక్టరేట్ లో మేడే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.






ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉద్యోగ కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఉద్యోగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని అన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా వే డేను ఘునంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

కార్మికుల దినోత్సవం ప్రతి కార్మికుడు గర్వపడవలసిన రోజు అని, జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని, నైపుణ్యం లేని కార్మికుల నైపుణ్యం పెంపొందించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాల భరోసా పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, భారత శక్తి ప్రతినిధి, మే 01:



శుక్రవారం రోజున జగిత్యాల కలెక్టరేట్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్దులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, రాష్ట్ర మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనితా రామచంద్రన్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మరియు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి బాల భరోసా పథకాన్ని ప్రారంభించారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా ఈ పథకంలో 33 ప్రశ్నలకు సంబంధించి వివిధ రకాల సమస్యలు ఉన్న 26 మంది 0 - 5 సంవత్సరాలు ఉన్న అంగన్వాడి చిన్నారులను ఎంపిక చేసి వీరికి ఆర్ బి ఎస్ కే మరియు వివిధ రకాల స్పెషలిస్ట్ డాక్టర్ల చేతప్రత్యేకంగా పరిశీలించడం జరిగింది. చిన్న చిన్న సమస్యలు అయితే ఇక్కడే పరిష్కారం చూపడం, పెద్దగా ఉంటే రిఫర్ చేయడం వంటివి చేయడం జరుగుతుందని డిఎంహెచ్ఓ సుజాత వివరించారు.

దీనితోపాటు కలెక్టరేట్లో చిన్నపిల్లల కోసం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా క్రెష్ ప్రారంభించడం జరిగింది.

ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, వయో వృద్దుల శాఖ డైరెక్టర్ శైలజా,డి ఎం ఎచ్ ఓ సుజాత, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, మెడికల్ ఆఫీసర్ లు, స్పెషలిస్ట్ డాక్టర్ లు, ఆర్ బి ఎస్ కె టీమ్, డి ఎం ఎచ్ ఓ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ శక్తి పురస్కారం అందుకున్న తాపీ మేస్త్రి ఆకుల రవి యాదవ్

## గాంధీ భవన్ లో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో అందజేత





భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)మే 01: ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని (మేడే) పురస్కరించుకొని హైదరాబాద్ గాంధీభవన్లో ఐఎన్టియుసి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తాపీ కార్మిక యునియన్ అధ్యక్షుడు ఆకుల రవియాదవ్ కు శ్రమశక్తి పురస్కారం మరియు ప్రశంసా ప్రతం ఐఎన్టియుసి రాష్ట్ర చైర్మన్ ప్రకాష్ గౌడ్, హన్మంతరావు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా రవియాదవ్ మాట్లాడుతూ 2003వ సంవత్సరంలో మొదటి అవార్డు, నేడు రెండవ సారి శ్రమశక్తి పురస్కారానికి ఎంపిక కావడానికి కృషి చేసిన రాష్ట మరియు జిల్లా నాయకులకు లక్ష్మీ నరసింహస్వామి తాపీ కార్మిక యునియన్ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు సుడుగు జీవన్ రెడ్డి,

యునియన్ గౌరవ అధ్యక్షులు శెట్టి గోపాల్, ఉపాధ్యక్షులు పల్లెపాటి మాధవులు, ప్రధాన కార్యదర్శి కొలనుపాక విఠల్, సహ కార్యదర్శి పబ్బాల చంద్రయ్య, కోశాదికారి దూశెట్టి గోపాల్, కార్యవర్గ సభ్యులు జక్కుల చంద్రయ్య, మాటూరి సోమేష్, బండి అశోక్, శెట్టి వెంకటేష్, పేరబోయిన యాదగిరి, పిన్నం సీతయ్య, సుక్కల బిక్షపతి, కొమ్మగాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 01(భారత శక్తి) జిల్లాలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.



శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వేసవికాలం త్రాగునీటి సరఫరాపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ కూడా ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ప్రజలకు త్రాగునీరు అందించడంలో ఇబ్బందులు ఎదురైతే, అధికారులు వెంటనే స్పందించి, త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాలలో ఎక్కడైనా తాగునీటి సరఫరా పైపులు లీకేజీలు, మరమ్మత్తులు ఉంటే రిపేర్లు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలలో త్రాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, డిపిఓ శ్రీనివాస్, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల అద్దాలు పగలకొట్టే ఆకతాయిలు అరెస్టు

హైదరాబాద్ మే1

స్లింగ్ షాట్తో షాపుల గాజులు ధ్వంసం చేసిన సీరియల్ నిందితులు అరెస్ట్; 11 కేసులు ఛేదించిన ఐఎస్ సదన్ పోలీసులు 30-04-2026న ఐఎస్ సదన్ పోలీసులు వరుసగా షాపుల గాజులను ధ్వంసం చేస్తూ ప్రజలకు ప్రమాదం కలిగించే చర్యలకు పాల్పడిన (4) మంది నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులు గులెల్ (ాశ్రీతినిణబష్ట్రనీబి) మరియు గోటి (ఉశ్రీజీబబ ఃజీశ్రీశ్రీబ) సహాయంతో వివిధ పోలీస్ స్టేషన్ పరిధుల్లో షాపుల గాజులను పగులగొట్టి వినోదం పొందుతూ ఈ నేరాలకు పాల్పడ్డారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలు సంతోష్నగర్, సైదాబాద్, చాదర్ఘాట్, మలక్పేట్, చంద్రాయణగుట్ట, సరోర్నగర్ మరియు ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో చోటుచేసుకున్నాయి. మొత్తం 11 కేసులు ఛేదించబడినవి. అరెస్ట్ చేసిన నిందితుల వద్ద నుండి ఒక క్వాలిస్ వాహనం, రెండు మొబైల్ ఫోన్లు, గులెల్ (స్లింగ్ షాట్) మరియు గాజు బంతులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు చార్మినార్ జోన్ డీసీపీ శ్రీ కిరణ్ ఖరే, ఏసీపీ సంతోష్నగర్ డివిజన్ టి. సుఖ్దేవ్ సింగ్ మరియు ఇన్స్పెక్టర్ జి. నాగరాజు పర్యవేక్షణలో, ఎస్ఐ శ్రీ కె. మహేష్ దర్యాప్తులో ఐఎస్ సదన్ పోలీస్ బృందం విజయవంతంగా ఛేదించింది.

## ఆశ్రమ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు కలెక్టర్ సన్మానం



నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 01(భారత శక్తి) : జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులను జిల్లా కలెక్టర్ శ్రీ భవేష్ మిశ్ర గారు సన్మానించారు. ఈ కార్యక్రమం గిరిజన సంక్షేమాధికారి శ్రీ జాదవ్ అంబాజీ గారి సమక్షంలో జరిగింది.

ప్రభుత్వ ఆశ్రమ హైస్కూల్ (బాలుర) ఖానాపూర్‌కు చెందిన విద్యార్థి లవుద్య వంశీ 575 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే ప్రభుత్వ ఆశ్రమ హైస్కూల్ (బాలికల) టైంను చెందిన విద్యార్థిని రాథోడ్ కాజల్ 563 మార్కులు, ప్రభుత్వ ఆశ్రమ హైస్కూల్ (బాలికల) ఖానాపూర్‌కు చెందిన నమిత 563 మార్కులు సాధించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను మరియు వారి తల్లిదండ్రులను శాలువాతో సన్మానించి, భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని అభినందించారు. జిల్లాలో ఆశ్రమ పాఠశాలల్లో ఇలాంటి ఉత్తమ ఫలితాలు రావడం పట్ల గిరిజన సంక్షేమ శాఖాధికారి జాదవ్ అంబాజీని ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ డా. ఆర్. శివాజీ, భుక్యా రమేష్, టి. గంగాధర్, రాజేందర్, కె. పుకార్, బక్కన్న తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం

జనగామ జిల్లా (భారత శక్తి)మే 1:

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే 1) సందర్భంగా



కోతి ప్రవీణ్ కుమార్ కోలుకొండ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కార్మికులు కీలకమని,వారి సంక్షేమానికి వెంటనే కార్మికులకు ప్రతి ఒక గ్రామశీలో కమిటీ భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని కార్మికుల తరపున కోరారు.

కార్మిక దినోత్సవశీ సందర్భంగా కౌడగాని కుమారస్వామి జెండాను ఎగురవేశారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మిట్ట బిక్షపతి,వాసర్ల బీరప్ప, రచ్చ శ్రావణ్, చింత నరేశ్,మరియు గ్రామ పెద్దలు, కార్యకర్తలు గుండెకారి శ్రీనివాస్, కుర్నాల రవి, వాసర్ల మల్లయ్య మాచర్ల బాబు,మాచర్ల, ఐలయ్య, చీకట్ల కుమారస్వామి, ఎల్లయ్య,ముస్త్యాల రమేష్, దామెర రాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు తమ వృత్తులలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
## కలెక్టరేట్లో ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, మే 01(భారత శక్తి) కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో శుక్రవారం మేడే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచ అభివృద్ధికి కార్మికులే శక్తి అని అన్నారు. కార్మికులు అందరూ తమ తమ వృత్తులకు సంబంధించి నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల, ఉన్నతి సాధించగలుగుతారని వివరించారు. ప్రతి ఒక్కరూ కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్మికులకు, ప్రభుత్వాలు అమలుపరుస్తున్న పథకాలు పొందాలని చెప్పారు. నైపుణ్యాలు ఉన్న కార్మికులకు విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని.. కార్మికులు తదనుగుణంగా ఆలోచన చేసి అవకాశాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. ప్రభుత్వాలు కూడా కార్మికుల్లో నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణలు ఇస్తున్నాయని, కార్మికులు వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ "అచీవ్మెంట్స్, ఆక్టివిటీస్" బుక్ లెట్ ఆవిష్కరించారు. పలువురు కార్మికులకు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు.

అనంతరం అధికారులు, కార్మికులు కలెక్టర్ కు జ్ఞాపిక అందించి, శాలువాతో సన్మానించారు.

ఈ కార్మికదినోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ (కిషోర్) కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ముత్యం రెడ్డి, కార్మిక శాఖ అధికారి రాజలింగు, ఉపాధి కల్పన అధికారి విజయలక్ష్మి, కోటిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పథకాల అమలు: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 1 ( భారత శక్తి ): కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల నగరపాలక సంస్థ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ దుర్గం క్రాంతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్మికుల దినోత్సవం ప్రతి కార్మికుడు గర్వపడవలసిన రోజు అని, జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ప్రమాద రీత్యా మరణించిన 102 కార్మికుల కుటుంబాలకు సుమారు 60 కోట్ల రూపాయలు, సహజ మరణం పొందిన 223 కార్మికుల కుటుంబాలకు సుమారు 24 కోట్ల రూపాయలు, పెళ్లి ప్రోత్సాహం కింద 993 మందికి సుమారు 30 కోట్ల రూపాయలు, ప్రసూతి ప్రోత్సాహం కింద 1 వేయి 646 మందికి సుమారు 49 కోట్ల రూపాయలు, దివ్యాంగత్వం పొందిన వారికి సుమారు 68 కోట్ల రూపాయలు అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని, నైపుణ్యం లేని కార్మికుల నైపుణ్యం పెంపొందించేందుకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని, అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్లు, పారిశ్రామిక శిక్షణ సంస్థల ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు.

--------- మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ జిల్లాలోని కార్మికుల భద్రత, హక్కులను కాపాడడం కోసము ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో త్వరలోనే ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు అయ్యేలా కృషి చేయడం జరుగుతుందని, అసంఘటిత కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి ఇచ్చే నగదును



15 లక్షల రూపాయలకు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సింగరేణిలోని ఒప్పంద కార్మికులకు 5 వేల రూపాయల బోనస్ ఇవ్వడం జరిగిందని, 2 లక్షల 50 వేల రూపాయల లోపు ఆదాయం ఉన్న సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆహార భద్రత, విద్య ప్రతి ఒక్కరికి అందేలా ప్రభుత్వ పథకాలు రూపొందించడం జరిగిందని, ప్రభుత్వం కార్మికులకు, రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.అనంతరం కార్మిక శాఖకు చెందిన బి.సత్యనారాయణ, ఉపాధి కల్పన క్రింద వై. రమేష్ (ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్) , ఉత్తమ ఎస్టాబ్లిష్మెంట్ క్రింద ఓరియంట్ సిమెంట్-దేవాపూర్, ప్రత్యేక కేటగిరీ (బాల కార్మిక) క్రింద శివాజీ (7 తరగతి విద్యార్థి, జడ్.పి.హెచ్.ఎస్. టేకుల బస్తి, బెల్లంపల్లి) లకు అవార్డులు అందజేశారు.తదనంతరం జిల్లాలోని 16 మండలాలకు ఏం ఎన్ ఆర్ ఇ జి ఎస్ పనుల కోసం పంచాయతీరాజ్ ఉ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మంజూరు చేసిన కంప్యూటర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ కార్మిక దినోత్సవం



జనగామ జిల్లా (భారత శక్తి)మే 1:

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే 1) సందర్భంగా కోతి ప్రవీణ్ కుమార్ కోలుకొండ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో కార్మికులు కీలకమని,వారి సంక్షేమానికి వెంటనే కార్మికులకు ప్రతి ఒక గ్రామశీలో కమిటీ భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని కార్మికుల తరపున కోరారు.కార్మిక దినోత్సవశీ సందర్భంగా కౌడగాని కుమారస్వామి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మిట్ట బిక్షపతి,వాసర్ల బీరప్ప, రచ్చ శ్రావణ్, చింత నరేశ్,మరియు గ్రామ పెద్దలు, కార్యకర్తలు గుండెకారి శ్రీనివాస్, కుర్నాల రవి, వాసర్ల మల్లయ్య మాచర్ల బాబు,మాచర్ల, ఐలయ్య, చీకట్ల కుమారస్వామి, ఎల్లయ్య,ముస్త్యాల రమేష్, దామెర రాములు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి పదవి విరమణ

- ఘనంగా వీడ్కోలు పలికిన జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది
- 23 ఏండ్ల సుదీర్ఘ సేవలు అందించిన ప్రధాన న్యాయమూర్తి
- ముక్తకంటం తో కీర్తించిన ప్రముఖులు.

భూపాలపల్లి ప్రతినిధి, మే 1 (భారత శక్తి) : 23 ఏండ్ల సుదీర్ఘ సేవలు అందించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులు సి.హెచ్. రమేష్ బాబు గారు గురువారం పదవి విరమణ చేసారు. 2003



సంవత్సరంలో న్యాయమూర్తిగా పదవి బాధ్యతలు చేపట్టి రాష్ట్ర న్యాయ వ్యవస్థలో వివిధ ఉన్నత స్థానాల్లో సేవలందించిన జడ్జి గారు పదవి విరమణ చేయడం పట్ల అందరు విచారాన్ని వ్యక్తం చేసారు. అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం రిటైర్మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుండి పదిమంది జడ్జి లు హాజరైయ్యారు. గౌరవనీయులు రమేష్ బాబు గారి సేవలను, వారి ఆదర్శ జీవితాన్ని అందరు ముక్తకంఠంతో కొనియాడారు. విశ్రాంత జీవితంలో వారు సమాజ సేవ చేయాలనీ జడ్జి గారి కూతురు చిట్టూరి వైష్ణవి అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. అందరు కలిసి జడ్జి గారికి ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్జి గారి సతీమణి అనంతలక్ష్మి, ములుగు ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్ర కల, వరంగల్ ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మల గీతాంబ, వరంగల్ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి జే. మైత్రేయి, విశ్రాంత న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జి టి. కన్హయ్య లాల్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కూనూరు సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తే ప్రభుత్వం కఠిన చర్యలు: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి ప్రతినిధి, మే 1 (భారత శక్తి) భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా కార్మిక, ఉపాధి, కర్మాగారాలు మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా. బిఆర్ అంబేద్కర్ కార్మికులకు 8 గంటలు పని గంటలు ఉండాలని రాజ్యాంగంలో పొందుపరచినట్లు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్మికులచే వెట్టి చాకిరి చేపించే వ్యవస్థలపై ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా వ్యవహరిస్తుందని, చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మెగా ఏజెన్సీ 140 మంది కార్మికులు చేయాల్సిన పనులను 70 మందితో పనులు నిర్వహిస్తున్నదని, దీనిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే, అధిక పని భారం మోపే అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. కార్మికులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం మే డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్మికుల కృషితోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, ఎన్నో త్యాగాల ఫలితంగా ఈ హక్కులు సాధ్యమయ్యాయని కొనియాడారు. ఎందరో కార్మికులు తమ జీవితాలను త్యాగం చేసారని, కార్మికులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.



సింగరేణి, జెన్కో వంటి పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు ప్రజాసేవలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. చట్ట ప్రకారం అన్ని చర్యలు అమలు చేస్తున్నామని, ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. "డిగ్నిటీ ఆఫ్ లేబర్ ఈజ్ యువర్ రైట్" అని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణ, కార్మిక శాఖ అధికారి వినోద, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, ఐటీఐ ప్రిన్సిపాల్ జుమ్లా నాయక్, సింగరేణి ఏజీఎం ఎర్రన్నతో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి, వెంకటేశ్వర్లు, సతీష్, ఐఎన్టీయుసి జిల్లా కార్యదర్శి మధుకర్ రెడ్డి, క్యాతం సతీష్, కోలా శ్యామ్‌వివిధ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఏటీసీలో షార్ట్ టర్మ్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఉత్తమ ఉద్యోగులు గా ఎంపిక చేయబడిన సింగరేణి ఏజిఎం ఎర్రన్న కు ఉత్తమ ఉద్యోగి, ఏటీసి ఏటిఓ అభినవ్ కు అలాగే ఉత్తమ మేనేజ్మెంట్ క్రింద లక్ష్మి నరసింహ ఆగ్రో ఇండస్ట్రీస్ చిట్యాల రైస్ మిల్లు యజమాని వినయ్ కుమార్ ను ప్రశంసా పత్రం శాలువాతో సత్కరించారు. అలాగే పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్మానించారు.

## 4 లేబర్ కోడ్స్ లు వెంటనే రద్దు చెయ్యాలి.

**-పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.**

**-సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు**

మెదక్ జిల్లా, మే 01 (భారత శక్తి న్యూస్):140వ మేడే ఉత్సవాలు నర్సాపూర్ పట్టణం కేంద్రంలో ఘనంగా జరిగాయి. సిఐటియు జెండాలు కార్మికులు పెద్ద ఎత్తున ఎగరావేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు .ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ, అమెరికా చికాగో నగరంలోని కార్మికుల పనిగంటలు 18 గంటల నుండి 8 గంటలకు తగ్గియాలని నిరసన చేస్తున్న కార్మికులపై పోలీసులు తుపాకుల తూటాలతో విరుచుకబడి అనేకమంది కార్మికులను బలి తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రక్తపు మడుగులో నుంచి తీసిన జెండానే ఎర్ర జెండాగా నేడు ప్రపంచవ్యాప్తంగా కార్మికుల, కర్షకుల కోసం నిరంతరం కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నది ఎర్రజెండా ఒక్కటే అన్నారు. ఆనాటి కార్మికులు "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అనే నినాదంతో నేడు అనేక మంది కార్మికులు తమ హక్కులను సాధించుకుంటున్నారాని గుర్తుచేసారు. నాటి చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో నేటి కార్మికులు, కర్షకులు అందరూ కలిసి నేడు రాష్ట్రంలో, కేంద్రంలో పరిపాలిస్తున్నటువంటి నియంత ప్రభుత్వాలపై తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు కేంద్రంలో పరిపాలిస్తున్నటువంటి బిజెపి ప్రభుత్వం కులం, మతం,ప్రాంతం, భాషల పేర్లతో దేశ ప్రజలను రెచ్చగొడుతుందని మండిపడ్డారు. తక్షణమే కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కొనసాగించాలని, 4 లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ, నాయకులు అన్నపూర్ణ, పుష్ప, రాములు, రిజ్వానా, భీమేష్, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# సినిమా




## కుక్కల రక్తం' విక్రయాలపై రేణు దేశాయ్ ఆగ్రహం!

హైదరాబాద్‌లో ఇటీవల వెలుగులోకి వచ్చిన కుక్కల రక్తం విక్రయాల ఉదంతం ఎంతో మంది మనసులను కలచివేసింది. మూగజీవాల పట్ల చూపుతున్న ఈ అమానుషత్వంపై నటి, సామాజిక కార్యకర్త రేణు దేశాయ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. కుక్కల రక్తం అక్రమ విక్రయాల దందాపై ఆమె తీవ్రంగా స్పందించారు. ఈ దారుణాలను చూస్తుంటే సమాజం ఎంతటి భయంకరమైన 'కలికాలం'లో ఉందో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "మనుషులనే కిడ్నాప్ చేసి కిడ్నీలు అమ్మేసే కఠిన హృదయులు ఉన్న చోట, నోరులేని కుక్కలను వదులుతారని ఎలా అనుకుంటాం?" అని ఆమె ప్రశ్నించారు. రక్తం అమ్మేవాడి కంటే కొనేవాడిదే పెద్ద తప్పని ఆమె అభిప్రాయపడ్డారు. ఆ రక్తం ఎక్కడి నుంచి వస్తోంది, ఎలా సేకరిస్తున్నారు అనే కనీస అవగాహన లేకుండా కొనడం వల్ల ఇలాంటి అక్రమ దందాలకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని అన్నారు. తప్పు చేసిన వారు ప్రకృతి సిద్ధమైన శిక్ష నుంచి తప్పించుకోలేరని ఆమె పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ కర్మ సిద్ధాంతాన్ని గుర్తుంచుకోవాలి. మనం చేసే ప్రతి తప్పుకు ఫలితం అనుభవించాల్సిందే. మనం చేసే కర్మ మనకు కచ్చితంగా తిరిగి వస్తుంది" అని ఆమె హెచ్చరించారు.



## బాలకృష్ణ కొరటాల కాంబో ఫిక్స్.. మాస్‌కు మళ్లీ పండగ

టాలీవుడ్‌లో మరో క్రేజీ మాస్ కాంబో ఫిక్స్ అయింది. బాలకృష్ణ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో సినిమా రానున్నట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. నేడు ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. కొరటాల శివ మార్కు సామాజిక సందేశంతో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా ఈ సినిమా ఉండనున్నట్లు తెలుస్తోంది. ''అధికారానికి ఉద్దేశం తోడైతే.. అది ఉద్యమంగా మారుతుంది'' అనే పవర్‌ఫుల్ కొటేషన్‌తో టీమ్ దీనిపై అంచనాలు పెంచేసింది. దర్శకుడు ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేశారని త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుందని టీమ్ తెలిపింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడించనున్నారు. ప్రస్తుతం బాలకృష్ణ.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. 'వీరసింహారెడ్డి' తర్వాత బాలకృష్ణ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో బాలయ్యకు జోడీగా నయనతార నటిస్తున్నట్లు సమాచారం.


## జూన్ 4న వస్తున్న రామ్ చరణ్ పెద్ది... ఇది పక్కా!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను ఈ ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ఖాతాలో, "జూన్ 4న 'పెద్ది'ని కలవండి. థియేటర్లలో కలుసుకుందాం" అని పోస్ట్ చేశారు. ఈ మేరకు రిలీజ్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిన వెంటనే ఈ ప్రకటన రావడం గమనార్హం. మే 1వ తేదీ తెల్లవారుజామున, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు 'పెద్ది' షూటింగ్ పూర్తయినట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌తో తన ప్రయాణం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. "రామ్ చరణ్‌తో 'పెద్ది' ఒక మధురమైన ప్రయాణం. ఆయనతో పనిచేయడం చాలా ప్రత్యేకం. తెరపై పవర్‌హౌస్ పెర్ఫార్మర్, తెర వెనుక అద్భుతమైన స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించిన జ్ఞాపకాలకు కృతజ్ఞతలు" అని రత్నవేలు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతమైన నటనను ప్రదర్శించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి అని చరణ్‌ను ఆయన కొనియాడారు. ఈ సినిమా కోసం చివరిగా ఒక స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించినట్టు గతంలోనే వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌లో రామ్ చరణ్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉంటుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ట్యూన్, డ్యాన్స్, గ్రాండ్ సెట్, అందులోని సర్‌ప్రైజ్‌తో ప్రేక్షకులు థియేటర్లలో ఉర్రూతలూగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇది మరో చార్ట్‌బస్టర్ అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు. వాస్తవానికి ఈ సినిమాను ముందుగా విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించేందుకే జూన్‌కు వాయిదా వేస్తున్నట్టు వారం క్రితం నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ప్రకటించింది. "మా సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. సినిమా టాకీ పార్ట్ పూర్తయింది, కేవలం ఒక పాట మాత్రమే మిగిలి ఉంది. ఎడిట్ చూసుకున్నాం, అవుట్‌పుట్‌తో చాలా సంతోషంగా ఉన్నాం. ఇంత మంచి కంటెంట్‌ను అత్యుత్తమంగా అందించాలనుకుంటున్నాం. అందుకే మా టెక్నీషియన్లకు, పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి కాస్త ఎక్కువ సమయం ఇచ్చి, పూర్తి నాణ్యతతో మీ ముందుకు రావాలని నిర్ణయించుకున్నాం" అని ఆ ప్రకటనలో వివరించింది. అందుకే సినిమాను జూన్‌కు వాయిదా వేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. ఇప్పుడు ఆ తేదీని ఖరారు చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది'పై మొదటి నుంచి భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటులు శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతికంగానూ ఈ సినిమా ఉన్నత ప్రమాణాలతో తెరకెక్కుతోంది. ఆర్ రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాష్ కొల్లా ఆర్ట్ డైరెక్షన్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




## ఒకవేళ విమానం కూలి నేను చనిపోతే.. ఆమిర్ ఖాన్ సీక్రెట్ నోట్


నటన, సినిమా అంటే తనకు ఎంత ఇష్టమో బాలీవుడ్ అగ్రకథానాయకుడు ఆమిర్ ఖాన్ పలు సందర్భాల్లో వెల్లడించిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తనకు సినిమాలపై ఉన్న ప్రేమను తెలిపే విషయాన్ని పంచుకున్నారు. ప్రతి విమాన ప్రయాణానికి ముందు తన సోదరుడు మన్సూర్ ఖాన్‌కు సీక్రెట్ నోట్ పంపుతానన్న ఆయన.. ఆ ప్రయాణంలో తనకు ఏమైనా అయితే విడుదల కానున్న సినిమాను మాత్రం ఆపవద్దని చెబుతానని అన్నారు. ''ఏదైనా సినిమా షూటింగ్ మొత్తం పూర్తయి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్నప్పుడు నేను విమాన ప్రయాణం చేయాల్సి వస్తే కచ్చితంగా మన్సూర్‌కు (Mansoor Khan) ఒక సీక్రెట్ నోట్ పంపుతాను. 'ఒకవేళ ఈ విమానం కూలిపోయి నేను చనిపోతే.. ఆ సినిమా పనులు నువ్వు చూసుకో' అని నోట్ సెండ్ చేస్తాను. అలాగే దర్శకులతో కూడా ఇదే విషయాన్ని చెబుతాను. నాకు ఏమైనా అయినా సినిమాను ఆపేయొద్దని.. మన్సూర్ సలహాలతో దాన్ని పూర్తి చేసి విడుదల చేయాలని కోరతా'' అని చెప్పారు.



విమాన ప్రయాణం ఎప్పుడు చేసినా తనకేమైనా అవుతుందేమోనన్న భయం ఉంటుందని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్ అవుతుండగా.. ఆయనకు సినిమాపై ఉన్న నిబద్ధతను నెటిజన్లు కొనియాడుతున్నారు. ప్రముఖ దర్శకుడు మన్సూర్ ఖాన్, ఆమిర్ ఖాన్ బంధువులే. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో 'ఖయామత్ సే ఖయామత్ తక్', 'జో జీతా వహీ సికందర్' వంటి హిట్ సినిమాలు వచ్చాయి. తాజాగా ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ నటించిన 'ఏక్ దిన్' చిత్రాన్ని మన్సూర్ నిర్మించారు.

## ధురంధర్' తర్వాత ఆదిత్యధర్‌లో మార్పు! యామీ గౌతమ్ ఏమన్నారంటే..

ఆదిత్యధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' ఇండస్ట్రీలో రికార్డులు తిరగరాసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా విజయం ఆదిత్యలో ఎలాంటి మార్పు తీసుకురాలేదని ఆయన భార్య, నటి యామీ గౌతమ్ అన్నారు. సినిమా హిట్ కావడంపై స్పందిస్తూ.. కథ బాగుంటే సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని చెప్పారు. దానికి 'ధురంధర్' ఒక ఉదాహరణ అని అన్నారు. ''సినిమా విషయంలో కీలక బాధ్యత దర్శకుడిదేనని నేను నమ్ముతాను. దీని విజయంలో స్క్రిప్ట్‌కే అధిక ప్రాధాన్యం. ఆదరణ పొందాలంటే కథ కచ్చితంగా బాగుండాలి. 'ధురంధర్' విజయం కేవలం కొత్త రికార్డుల గురించి మాత్రమే చెప్పడం లేదు. థియేటర్లకు ప్రేక్షకులను తీసుకురావడానికి మనం ఎంతో కష్టపడుతున్న సమయంలో ఈ సినిమా అందరికీ ఒక విషయాన్ని స్పష్టం చేసింది. మంచి చిత్రాలు తీస్తే ఇప్పటికి కూడా థియేటర్ల వద్ద ప్రజలు బారులు తీరతారని చూపింది. మీరు అద్భుతమైన సినిమాలు తీయండి.. మేము చూడడానికి సిద్ధంగా ఉన్నామని ప్రేక్షకులు మరోసారి రుజువు చేశారు'' అని యామీ గౌతమ్ అన్నారు. ఈ భారీ విజయం తర్వాత కూడా ఆదిత్య గతంలో ఉన్నట్లే ఉన్నారని యామీ అన్నారు. ''ఈ సక్సెస్ మాలో మార్పు తీసుకురాలేదు. ఆదిత్య 'ధురంధర్'కు ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడూ అలాగే ఉన్నాడు. ఈ విజయాల వల్ల ఆయన ప్రవర్తన మారలేదు. ఆయన జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు ఉన్నాయి. కానీ ఎప్పుడూ ఆయన తన సహనాన్ని కోల్పోలేదు. మా ఇద్దరికీ దేవుడిపై అపారమైన నమ్మకం ఉంది. మంచి చేసే వారికి మంచే జరుగుతుందని నమ్ముతాం. మనకు దక్కాల్సినది కొంచెం ఆలస్యం కావచ్చేమో కానీ, రాసిపెట్టి ఉంటే కచ్చితంగా దక్కుతుంది'' అని యామీ చెప్పారు.



# కార్మిక సంక్షేమంలో ముందంజలో ఆర్బీఓఎల్



* కలెక్టర్ చేతుల మీదుగా ఎండీ సరళ రెడ్డికి అవార్డు
* సౌకర్యాల కల్పనలో ఆదర్శంగా నిలిచిన యాజమాన్యం.. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి
* కార్మికులే సంస్థకు బలమైన పునాది: ఎండి బుయ్యని సరళ రెడ్డి

వికారాబాద్, మే 1 (భారత శక్తి ) : కార్మికుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రాడికల్ బయో ఆర్గానిక్ లిమిటెడ్ (ఆర్బీఓఎల్) సంస్థకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మే డే (కార్మికుల దినోత్సవం) సందర్భంగా ఉత్తమ యాజమాన్యాలకు అందించే ప్రతిష్టాత్మక అవార్డును ఈసారి ఆర్బీఓఎల్ సంస్థ సొంతం చేసుకుంది. శుక్రవారంవికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన మేడే పురస్కారాల కార్యక్రమంలో ఆర్బీఓఎల్ ఎండి బుయ్యని సరళ రెడ్డి ఈ అవార్డును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి చేతుల మీదుగా అందుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమాన్ని ముఖ్యంగా పరిగణిస్తూ వారి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఆర్బీఓఎల్ యాజమాన్యం అభినందనీయం అన్నారు. కార్మికుల అభివృద్ధే సంస్థ అభివృద్ధికి పునాది అనే దృక్పథంతో పని చేస్తుండటం వల్లే ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు.

* **అనంతరం ఆర్బీఓఎల్ ఎండి బుయ్యని సరళ రెడ్డి మాట్లాడుతూ,...**

"ఒక సంస్థ విజయవంతంగా నడవాలంటే కార్మికులే ప్రధాన బలం. వారి సంక్షేమం చూసుకోవడం యాజమాన్యంగా మా బాధ్యత" అని అన్నారు. ఈ అవార్డును సంస్థలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి అంకితం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమం అనంతరం కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేసి, వారిని సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఓఎల్ సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, కార్మిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు. కార్మిక సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆర్బీఓఎల్ - ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది








## సంప్రదయని ఈవెంట్ ప్లానర్స్" షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్

పటాన్‌చెరు, మే 1(భారత శక్తి) : పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయి రాం కాలనీలో MDR యువసేన సభ్యుడు సాయి ముదిరాజ్ నూతనంగా ప్రారంభించిన "సంప్రదయని ఈవెంట్ ప్లానర్స్" షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ హాజరై, కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయం అని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాపారాల స్థాపన ద్వారా స్థానిక స్థాయిలో ఉపాధి అవకాశాలు విస్తరించడమే కాకుండా ఆర్థిక అభివృద్ధికి దోహదం జరుగుతుందని తెలిపారు. సాయి ముదిరాజ్ భవిష్యత్తులో మరింత విజయాలు సాధించి, తన వ్యాపారాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# రసాయన శాస్త్రంలో నగరపు లక్ష్మీకుమారికి పీహెచ్.డీ.



పటాన్‌చెరు, మే 1 (భారత శక్తి) : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని నగరపు లక్ష్మీకుమారి డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'క్లోఫరాబైన్, డెసిటాబైన్, బెలినోస్టాట్, బోర్టెజోమిబ్ తయారీలో కీలక మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐ) సంశ్లేషణకు అధునాతన విధానాల'పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిత్తలూరి సుధాకర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ కుమారి చేసిన డాక్టరల్ పరిశోధన, కీలకమైన ఔషధ మధ్యస్థ పదార్థాలు, క్రియాశీల ఔషధ పదార్థాల (ఏపీఐల) సంశ్లేషణ కోసం వినూత్న, సమర్థవంతమైన వ్యూహాలను అందిస్తుందన్నారు. ఈ అధ్యయనం తేలికపాటి చర్య పరిస్థితులలో తక్కువ ఖర్చుతో కూడిన కారకాలను వినియోగించడం ద్వారా, పారిశ్రామిక వినియోగానికి అనువైన వేగవంతమైన, అధిక దిగుబడినిచ్చే, విస్తరించదగిన ప్రక్రియలను సూచిస్తోందని తెలిపారు. డాక్టర్ కుమారి పరిశోధన, క్యాన్సర్ నిరోధక మందుల అభివృద్ధికి గణనీయమైన అవకాశాలను అందించే ఆచరణాత్మక, పారిశ్రామికఆధారిత సంశ్లేషణ పద్ధతులను పరిచయం చేస్తుందన్నారు. ప్రాణాలను కాపాడే ఈ చికిత్సా విధానాల తయారీలో ఎదురయ్యే కీలక సవాళ్లను పరిష్కరించడం ద్వారా, ఆమె పరిశోధన ఔషధ రసాయన శాస్త్రం, ఔషధ తయారీ రంగాలలో పురోగతికి గణనీయంగా దోహదపడుతుందని వెల్లడించారు. డాక్టర్ లక్ష్మీకుమారి సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర గౌసియా బేగం, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ కుమారి సాధించిన ఈ విజయం ఆమె అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తుందని, క్యాన్సర్ చికిత్సల భవిష్యత్తుకు ఒక విలువైన తోడ్పాటును అందిస్తుందన్నారు.

## ఘనంగా గోరుకొత్తపల్లి మండల కేంద్రంలో
## 104వ మేడే కార్యక్రమం



రేగొండ, మే 1 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో మేడే కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పైల్లశాంతి కుమార్ నాలుగు దిక్కుల హమాలీ ఆటో వర్కర్స్ బిల్డింగ్ వర్కర్స్ పార్టీ శ్రేణుల జెండా ఆవిష్కరణ చేసారు. అనంతరం పైళ్ళ శాంతి కుమార్ కార్మికుల ఉద్దేశించి మాట్లాడుతూ చికాగో నగరంలో జరిగిన పోరాటంలో రక్తం నుండి ఉద్భవించిన జెండా ఈ ఎర్ర జెండా అని ఎర్ర జెండా పోరాటాలకు స్ఫూర్తి అని కార్మికుల కోసం కార్షకుల కోసం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడే జెండా ఎర్ర జెండా అని అన్నారు. కార్మికుల హక్కుల కోసం అనునిత్యం పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం విఫలం చేసే ప్రయత్నం చేస్తుందని దానికి వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు చేసి కార్మిక హక్కులను కాపాడుకోవాలని పైళ్ళ శాంతి కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొమ్మరాజు తిరుపతి, మహమ్మద్ అమీద్, నిమ్మల శంకర్, రఘు సాల తిరుపతి, ఉప సర్పంచ్ ఎస్ రవి, ఎంజాల సురేష్, సంపత్, కట్ల నాగార్జున, కట్ల సతీష్, భుజం జితేందర్, బొమ్మ శంకర్, కంటి స్వామి, కర్రీ రమేష్, అయ్యా అశోక్, వైనాల ఐలయ్య, దొంతుల శీను తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి: మధుయాష్కి గౌడ్

* **సరూర్ నగర్ స్టేడియంలో స్పోర్ట్స్ కిట్ల పంపిణీ**



సరూర్ నగర్, మే 1(భారత శక్తి) : యువత వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా 'మై భారత్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో యువ క్రీడాకారులకు క్రీడా సామాగ్రి (స్పోర్ట్స్ కిట్లు)ను ఉచితంగా పంపిణీ చేశారు.

**మత్తుకు దూరం.. క్రీడలకు ప్రాధాన్యం**

ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలంటే క్రీడలను అలవాటు చేసుకోవాలని సూచించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వాన్ని మాత్రమే కాకుండా, మానసిక స్థైర్యాన్ని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం యువత సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే ఇలాంటి ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా పేరు నిలబెట్టాలని కోరారు.

**పాల్గొన్న ప్రముఖులు**

కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఐసయ్య, జిల్లా క్రీడాధికారి స్వర్ణలత, రామచంద్రరావు, గజ్జి భాస్కర్, బత్తుల వేణు, దాము మహేందర్ యాదవ్, సునీల్ బాబు, నరేష్ గుప్త, సాయి కిరణ్, అంతటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులకు కిట్లను అందజేసిన అనంతరం వారితో కలిసి మధుయాష్కి గౌడ్ కాసేపు ముచ్చటించి వారిని ఉత్సాహపరిచారు.




## అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు బేబీ కిట్స్ పంపిణీ

భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 0 నుండి 5 సంవత్సరముల పిల్లలకు శుక్రవారం ఆర్బిఎస్కే డాక్టర్లు వైద్య పరీక్షలు చేయడం జరిగింది. అదేవిధంగా 2026 జనవరిలో పుట్టిన ఆడపిల్లలకు భేటీ పడావో బేటీ బచావో బేబీ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ స్వరాజ్యం, సూపర్వైజర్ జంగమ్మ, అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ పిల్లల తల్లులు, టిహెచ్ఆర్ పిల్లల తల్లులు, టీచర్లు సుగుణ, భాగ్య, ఆయాలు పాల్గొన్నారు.

# ఉజ్వాల భవిష్యత్తుకు 'బాల భరోసా' ఒక వరం: జిల్లా కలెక్టర్ అంకిత్

* **మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా "బాల భరోస కార్యక్రమం**



భద్రాద్రి కొత్తగూడెం, మే 01 (భారతశక్తి): జిల్లా కేంద్రంలోని రామవరంలో గల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల భరోస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు 99 రోజుల ప్రజా ప్రణాళిక లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బాల భరోసా కార్యక్రమం జిల్లా మహిళా శిశు సంక్షేమం మరియు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని, చిన్నారుల్లో ఉండే, న్యూరో డెవలప్‌మెంట్ (నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు, శారీరక ఎదుగుదల లోపాలు, మానసిక వికాసంలో ఆలస్యం వంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందన్నారు. దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు. బాల భరోస కార్యక్రమం ముఖ్య ఉద్దేశం సకాలంలో జోక్యం అని పిల్లలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే, వెంటనే వైద్య నిపుణుల పర్యవేక్షణలో చికిత్స ప్రారంభించి, ఆ సమస్య తీవ్రతరం కాకుండా చూడాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక, మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి, అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించాలన్నారు. చిన్నారులు ఆరోగ్యంగా, సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె. స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కే టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టల్లో వివరాలను నమోదు చేయడం జరిగిందని, దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్, శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి ఈరోజు జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ గారి నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని, అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు, ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, సంతోషంగా, సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం చేశారు. తదుపరి బేటి బచావో కార్యక్రమంలో భాగంగా భేటీ జన్మోత్సవ్ నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కే సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి. సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిరుదొడ్డిలో పోలీసుల అప్రమత్త - మహిళకు ప్రాణదానం

* కానిస్టేబుళ్లు రాజు, బాబులను అభినందించిన గ్రామస్తులు

సిద్దిపేట, మే 1( భారత శక్తి ) : సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ఓ మహిళ ప్రాణాపాయం నుంచి బయటపడిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన ఆమె, ఆవేశంలో గ్రామంలోని చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే బ్లూ కోర్టు పోలీసులు రాజు, బాబు ఘటన స్థలానికి చేరుకుని అప్రమత్తంగా స్పందించారు. చెరువులో మునిగిపోతున్న మహిళను స్థానికుల సహాయంతో నీటిలోకి దిగి బయటకు తీసుకొచ్చారు. ఐతే ఆమె అప్పటికే అపస్మారక స్థితిలో ఉండి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతోంది. ఈ కీలక సమయంలో పోలీసులు తమ ప్రాథమిక వైద్య నైపుణ్యాన్ని వినియోగించి సీపీఆర్ (CPR) నిర్వహించారు. కొద్ది సేపటికి ఆమెకు శ్వాస సక్రమంగా తిరిగి రావడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత ఆమెను మెరుగైన చికిత్స కోసం సమీప ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి, సాహసంతో పాటు చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజు, బాబులను గ్రామస్తులు అభినందిస్తున్నారు. వారి సేవలను ఉన్నతాధికారులు కూడా ప్రశంసించారు.








# బడంగ్‌పేట్ .. ఎర్లీ బర్డ్‌కు అనూహ్య స్పందన!

* 11 శాతం పెరిగిన వసూళ్లు.. ఖజానాకు రూ. 13.95 కోట్లు

బడంగ్‌పేట్, మే 1(భారత శక్తి) : బడంగ్‌పేట్ సర్కిల్ (16) పరిధిలో ముందస్తు ఆస్తి పన్ను (ఎర్లీ బర్డ్) వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. 202627 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీ అవకాశాన్ని నగరవాసులు భారీగా సద్వినియోగం చేసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పన్ను వసూళ్లలో 11 శాతం వృద్ధి' కనిపించడం విశేషం.

**గణాంకాలు ఇలా..**

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ముగిసిన ఈ గడువులోగా మొత్తం 15,432 మంది" పన్ను చెల్లింపుదారులు తమ బాధ్యతను నెరవేర్చారు. దీని ద్వారా మున్సిపల్ ఖజానాకు రూ. 13.95 కోట్ల" ఆదాయం సమకూరింది.

* గత ఏడాది (202526): రూ. 12.53 కోట్లు
* ప్రస్తుత ఏడాది (202627): రూ. 13.95 కోట్లు

అదనపు ఆదాయం: రూ. 1.42 కోట్లు

**కలిసొచ్చిన ప్రణాళిక:**

పన్ను వసూళ్లలో సాధించిన ఈ పురోగతిపై శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ, డిప్యూటీ కమిషనర్ వి. సమ్మయ్య హర్షం వ్యక్తం చేశారు. సమర్థవంతమైన క్షేత్రస్థాయి ప్రణాళిక, సిబ్బంది కృషి వల్లే ఇది సాధ్యమైందని వారు పేర్కొన్నారు. సమయానికి పన్నులు చెల్లించి నగర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రజలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

**సిబ్బందికి అభినందనలు**

వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఉత్సాహంతో మున్సిపల్ సేవల బలోపేతానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ పన్ను చెల్లింపుదారులు ఇలాగే సహకరించి, పెనాల్టీల భారం పడకుండా చూసుకోవాలని అధికారులు సూచించారు.

# మే డే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దోపిడీపై తిరుగుబాటు

* కార్మికులంతా కలిసి పోరాటాలు చేయాలని ఏఐటియుసి పిలుపు

ఎల్బీనగర్, మే 01 (భారత శక్తి ): మే డే సందర్భంగా సరూర్నగర్ మున్సిపల్ సర్కిల్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి మోహన్ నగర్ చౌరస్తా యూనియన్ బ్యాంక్ దగ్గర జెండా ఆవిష్కరించారు.ఆటో యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నర్సిరెడ్డి కొత్తపేట చౌరస్తాలో, కర్మాన్ ఘాట్ చౌరస్తా, సరూర్నగర్ ఆర్ అండ్ రెడ్డి తదితర ప్రాంతాలలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు మారుస్తూ, కార్మిక శక్తుల రక్త మాంసాలతో చెలగాటం ఆడుతున్నాయని నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుకుంటే ధరలకు అనుకూలంగా వేతనాలు ఇవ్వకుండా ఏళ్ల తరబడి పనిచేసినా పర్మెంటు లేదు, రిటైర్మెంట్ బెనిఫిట్ లేదు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు కనీస



సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఫ్రీ బస్సు వలన ఎంతో నష్టం జరుగుతున్నా ప్రభుత్వం ఇస్తానన్న హామీ అమలు చేయకపోవడం శోచనీయకం అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలు ఎంతో ఐక్యత పోరాటానికి ముందుండాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, లక్ష్మి, అందాల యాదయ్య, నరేందర్, ప్రమీల, కేశవ్, జయమ్మ, నరసింహ, అశోక్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, కృష్ణ, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా బుద్ధ జయంతి ఉత్సవాలు

## ముఖ్య అతిథిగా హాజరైన అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్

హైదరాబాద్, మే 1 (భారత శక్తి) : ఈరోజు తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బుద్ధ జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించడం జరిగింది. బౌద్ధ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసి, శాంతి, అహింస, సత్యం అనే మానవ విలువలను బోధించిన గౌతమ బుద్ధుడు స్ఫూర్తి నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఆ మహనీయుడి ఆలోచనలను ఆచరణలో పెట్టి, ఆయన చూపిన మార్గంలో నడవడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి. ఈ సందర్భంగా బుద్ధుని బోధనలు మన జీవితాల్లో అమలు చేసి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందించాలనే సంకల్పంతో ఈ వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బార్





కౌన్సిల్ ప్రెసిడెంట్ సుదర్శన్ రెడ్డి , చిక్కుడు ప్రభాకర్ , సీనియర్ కౌన్సిల్ హైకోర్ట్ అడ్వకేట్, జాయింట్ సెక్రటరీ కృష్ణ కీర్తన, హైకోర్ట్ అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ , ఇతర బార్ కౌన్సిల్ సభ్యులు మరియు సీనియర్ అడ్వకేట్స్ పాల్గొని వేడుకలను మరింత ఘనంగా నిర్వహించారు.

# వేసవి సెలవుల్లో ఊరికి వెళ్తున్నారా... జర జాగ్రత్త

ఎల్బీనగర్, ఏప్రిల్ 30 (భారత శక్తి ): ఈ వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు స్వగ్రామాలకు, విహారయాత్రలకు వెళ్లే సమయంలో భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ సూచించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ సమయంలో ఖాళీ ఇండ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు నగదు, బంగారం, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దని అన్నారు. బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం మంచిదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, మొబైల్ ఫోన్ లో కనెక్ట్ చేసుకోవాలన్నారు. నమ్మకమైన పొరుగువారు, బంధువులకు సమాచారం ఇచ్చి ఇంటిపై నిఘా ఉంచాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషను సమాచారం ఇవ్వాలని సూచించారు.

**పిల్లల భద్రతపై హెచ్చరిక..**

చెరువులు, కుంటలు, కాలువల వద్ద ఈతకు వెళ్లడం ప్రమాదకరం లోతు తెలియని నీటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందనో పిల్లలను ఒంటరిగా నీటి ప్రాంతాలకు పంపకూడదు



ఎప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని పేర్కొన్నారు.


**వేసవి జాగ్రత్తలు..**


ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో బయటకు వెళ్లడం తగ్గించాలని తగినంత నీరు తీసుకోవాలని ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే చోరీలు, ప్రమాదాలను నివారించవచ్చని సీఐ వినోద్ కుమార్ స్పష్టం చేశారు.

# తాండూరు పట్టణంలో చేతబడి కలకలం !

* ప్రేమ పేటాకులు కావాలని
* కూతురుపై తల్లి క్షుద్ర పూజలు
* మంత్రగాడికి కాలనీవాసుల దేహశుద్ధి
* కాలనీ పెద్దల జోక్యంతో వెలుగులోకి సంఘటన

తాండూరు, మే 1 (భారత శక్తి) : కూతురు ప్రేమ పెటాకులు కావాలని ఓ కన్నతల్లి సొంత కూతురుపైనే చేతబడి చేయించిన సంఘటన వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఇంద్ర నగర్ లో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. తాండూరు మండలం చంద్రవంచ గ్రామానికి చెందిన ఇందిరా ఓ అబ్బాయిని ప్రేమిస్తుంది. అయితే కూతురు ప్రేమ పెటాకులు కావాలని తల్లి సాయమ్మ తాండూరు పట్టణానికి చెందిన మంత్రగాడు సంప్రదించింది. ఇందులో భాగంగా ఈరోజు ఉదయం తెల్లవారుజామున పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో నిర్మానుష్య





ప్రదేశంలో అమ్మాయిని కూర్చోబెట్టి క్షుద్ర పూజలు చేస్తుండగా చూసిన కాలనీవాసులు ఇక్కడ ఏం చేస్తున్నావని ప్రశ్నించారు. విషయాన్ని అర్థం చేసుకొని కాలనీవాసులు కొందరు మంత్రగాడికి దేహశుద్ధి చేశారు.ఈ విషయం కాలనీ వాసుల జోక్యంతో తాండూరు పట్టణ పోలీసు స్టేషన్ కు చేరింది.తీవ్ర కలకలం రేగిన ఈ ఘటన పట్టణంలో చర్చనీయంశంగామారింది. ఇదిలా ఉండగా శుక్రవారం బిజెపి నాయకుడు చైతన్య ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



మే డే సందర్బంగా శానిటేషన్, ఎంటమాలజీ, జలమండలి డ్రైనేజీ వర్కర్స్, జిహెచ్ఎంసి విద్యుత్ దీపాల వర్కర్స్ అందరు కలిసి సుమారు 50 మందికి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మానం చేసి బహుమతులు అందించారు.ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా లింగోజీగూడ డివిజన్ కు సుమారు 10 కోట్లు ఫండ్ తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకు దర్పల్లి రాజశేఖర్ రెడ్డిని స్థానికులు ఘనంగా సత్కరించారు..

ఎల్బీనగర్, మే 01(భారత శక్తి):

# జగిత్యాలలో 'మే' డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి

* కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలి అని మంత్రి పిలుపు

జగిత్యాల, మే 1( భారత శక్తి ప్రతినిధి ): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ కార్మికులు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అనేక అవస్థలు పడ్డారని, కార్మికులు సమ్మె చేస్తే డిస్మిస్ చేస్తానని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హెచ్చరించారని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకల్లో భాగంగా జగిత్యాల జిల్లాలోని ఆర్టీసీ బస్ డిపోలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆర్టీసీ కార్మికుల సింగరేణి కార్మికుల పోరాట ప్రతిమ మరువలేనిదని మంత్రి అన్నారు. నాడు న్యాయమైన





డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వం కనీసం చర్చలకు ఆహ్వానించలేదని మంత్రి అన్నారు. ప్రజలు మార్పు కోరుకున్న ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసి కార్మికులు సమ్మె చేస్తే కేవలం మూడు రోజుల్లోనే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించామని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఐదుగురు మంత్రులు 24 సంఘాల ప్రతినిధులతో చర్చించి సమ్మెకు ముగింపు పలికామని మంత్రి తెలిపారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆర్టీసీ కార్మికులు అండగా నిలవాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కార్మిక సోదరులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జగిత్యాల ఆర్ టి సి కార్మి కుల సంఘం గౌరవ అధ్యక్షులు శంకర్ తోపాటు ఆర్టీసీ కార్మికులు నాయకులు పాల్గొన్నారు.

# దేశంలో కొత్త శకం.. ఇక టోల్ ప్లాజాలో ఆగక్కర్లేదు..!

సూరత్, మే 1, (భారత శక్తి) : దేశంలో టోల్ వసూళ్ల విధానంలో ఒక విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగకుండానే ప్రయాణించేందుకు వీలు కల్పించే భారతదేశపు మొట్టమొదటి బారియర్ ఫ్రీ టోల్ ప్లాజా కార్యకలాపాలు ప్రారంభించింది. ముంబైఢిల్లీ జాతీయ రహదారి (NH48)పై సూరత్ సమీపంలోని చోర్యాసి టోల్ ప్లాజా వద్ద ఈ అధునాతన వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. ఫిబ్రవరి 2 నుంచి దాదాపు రెండు నెలల పాటు విజయవంతంగా పరీక్షించిన తర్వాత దీనిని పూర్తిస్థాయిలో ప్రారంభించారు. ఈ కొత్త విధానంలో టోల్ ప్లాజాల వద్ద భౌతికంగా అడ్డంకులు (బారియర్లు) ఉండవు. మల్టీలేన్ ఫ్రీ ఫ్లో (MLFF) టెక్నాలజీ ఆధారంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) దీనిని అమలు చేస్తోంది. వాహనాలు టోల్ ప్లాజా వద్దకు రాగానే, పైన ఏర్పాటు చేసిన గ్యాంట్రీలపై ఉన్న హైరిజల్యూషన్ కెమెరాలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ANPR) టెక్నాలజీతో వాహనం నంబర్ ప్లేట్‌ను స్కాన్ చేస్తాయి. అదే సమయంలో, RFID సెన్సార్లు ఫాస్ట్‌ట్యాగ్ వివరాలను గ్రహించి, లింక్ అయిన బ్యాంకు ఖాతా నుంచి టోల్ రుసుమును ఆటోమేటిక్‌గా మినహాయిస్తాయి. ఈ ప్రక్రియ మొత్తం వాహనం ఆగకుండానే జరిగిపోతుంది. "ఈ బారియర్‌లెస్ టోలింగ్‌తో వాహనాన్ని ఎక్కడా ఆపాల్సిన అవసరం లేదు. వాహనం గ్యాంట్రీ కింద నుంచి వెళ్లగానే టోల్ రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది" అని ఎన్‌హెచ్‌ఏఐ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎ.ఆర్. చిత్రాన్ని వివరించారు. ఈ వ్యవస్థ ద్వారా వాహనాలు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో కూడా టోల్ ప్లాజాను దాటి వెళ్లవచ్చు. దీనివల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ రద్దీ, పొడవైన క్యూలు తగ్గుతాయి. ఒకవేళ వాహనానికి ఫాస్ట్‌ట్యాగ్ లేకపోయినా లేదా పనిచేయకపోయినా, నంబర్ ప్లేట్ ఆధారంగా వాహనాన్ని గుర్తించి, రిజిస్టర్డ్ యజమానికి టోల్ చెల్లించమని ఎలక్ట్రానిక్ నోటీసు పంపిస్తారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించిన ప్రకారం, 2026 చివరి నాటికి దేశవ్యాప్తంగా 1,050కి పైగా టోల్ ప్లాజాలను ఏఐ ఆధారిత బారియర్‌ఫ్రీ వ్యవస్థలుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల ఏటా రూ.1,500 కోట్ల ఇంధనం ఆదా అవ్వడంతో పాటు, మెరుగైన వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి అదనంగా రూ.6,000 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు

హైదరాబాద్, మే 01 (భారత శక్తి) : ఈ రోజు ఉదయం డీజీపీ కార్యాలయానికి చేరుకున్న సీవీ ఆనంద్ కు ఉన్నతాధికారులు సాదరంగా ఆహ్వానం పలికారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, ఆయన తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయనకు క్షేత్రస్థాయి నుండి అత్యున్నత స్థాయి వరకు విశేషమైన అనుభవం ఉంది. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో పనిచేసిన సమయంలో మావోయిస్టు సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని శాంతిభద్రతలను కాపాడారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తూ నగర భద్రతలో తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారు. సీవీ ఆనంద్ అంటేనే టెక్నాలజీకి మారుపేరు. ఈచలాన్, స్పీడ్ గన్స్ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టి ట్రాఫిక్ విభాగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. రివర్సిబుల్ లేన్లు, ఫ్రీ లెఫ్ట్ వంటి విధానాల ద్వారా వాహనదారుల ఇబ్బందులను తగ్గించడంలో ఆయన విజయం సాధించారు. ఇప్పుడు పూర్తిస్థాయి డీజీపీగా రాష్ట్రవ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్ నియంత్రణ మరియు ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆయన ఎలాంటి వినూత్న వ్యూహాలను రూపొందిస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అధ్యక్ష పీఠంపై మునీర్ కన్ను: భారత్‌పై ఉగ్ర కుట్ర!

న్యూఢిల్లీ/శ్రీనగర్, మే 1 : భారత గడ్డపై మరో భారీ ఉగ్రదాడికి పాకిస్థాన్ కుట్ర పన్నుతోందని, ఈసారి జమ్మూకశ్మీర్‌ను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టించేందుకు సిద్ధమవుతోందని విశ్వసనీయ నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. భారత్ ను ప్రతీకార దాడులకు పురిగొల్పి, ఆ తర్వాత అమెరికా వంటి దేశాల జోక్యాన్ని కోరడం ద్వారా కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ వేదికపైకి తీసుకెళ్లాలనేది పాక్ పన్నాగంగా కనిపిస్తోంది. ఈ మొత్తం వ్యూహం వెనుక పాక్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ వ్యక్తిగత, రాజకీయ ఆకాంక్షలు ఉన్నాయని అధికారులు విశ్లేషిస్తున్నారు. దేశీయంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న అసిమ్ మునీర్, తన ప్రతిష్ఠను పెంచుకోవడానికి భారత్‌పై ఒక పెద్ద దాడిని ఉపయోగించుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికాఇరాన్ మధ్య శాంతి చర్చల్లో మధ్యవర్తిగా నిలిచి అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలన్న ఆయన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో ఆయన దృష్టి మళ్లీ భారత్‌పైకి మళ్లింది. కశ్మీర్ అంశాన్ని రగిలించడం ద్వారా పాకిస్థాన్‌లో తన ఇమేజ్‌ను పెంచుకుని, భవిష్యత్తులో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించాలనేది ఆయన దీర్ఘకాలిక ప్రణాళిక అని ఓ అధికారి తెలిపారు. ఇందుకోసం మునీర్ రెండంచెల వ్యూహంతో ముందుకెళుతున్నారు. మొదటి దశలో, కశ్మీర్‌లోని స్థానిక యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహించి, చిన్నచిన్న దాడులు చేయించడం ద్వారా లోయలో అశాంతిని సృష్టించడం. దీనివల్ల పర్యాటక రంగం దెబ్బతినడంతో పాటు సరిహద్దుల్లో మోహరించిన భారత భద్రతా బలగాల దృష్టిని అంతర్గత భద్రత వైపు మళ్లించవచ్చు. రెండో దశలో, ఈ అదను చూసి సరిహద్దుల్లోని లాంచ్‌ప్యాడ్‌లలో సిద్ధంగా ఉన్న పెద్ద సంఖ్యలోని పాక్ ఉగ్రవాదులను భారత్‌లోకి పంపించి, ఒక భారీ దాడికి పాల్పడటం వారి వ్యూహంలో భాగం. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అది తమ అంతర్గత వ్యవహారమని భారత్ గట్టిగా స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో భారత్ చేత సైనిక చర్యకు ఆస్కారం కల్పించి, దానిని సాకుగా చూపి అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకునేలా చేయాలన్నదే మునీర్ అసలు లక్ష్యమని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడి చేసినా ఫర్వాలేదన్న తెగింపుతో మునీర్ ఉన్నారని, ఆయనకు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడమే ముఖ్యమని విశ్లేషకులు చెబుతున్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన మేడే గిఫ్ట్ ఇదే

హైదరాబాద్, మే 01 (భారత శక్తి) : ఎన్నికలు పూర్తికాగానే పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అలవాటుగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 80 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కమర్షియల్ సిలిండర్ గ్యాస్ ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మేడే కానుకగా హోటల్ కార్మికులకు ఇచ్చిన బహుమతి కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచడమేనని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో రూపాయి పాతాళానికి పడిపోతుంటే, సిలిండర్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని మండిపడ్డారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను కేటీఆర్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. సిగాచీ పరిశ్రమలో కార్మికులు ప్రమాదంలో చనిపోతే వారికి ఇప్పటి వరకు పరిహారం అందలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీర శూరకర్ణలా మాట్లాడారని, ఎన్నికలు అయ్యాక కుంభకర్ణుడిలా మారిపోయాడని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి ఉన్నప్పుడు జేమ్స్ బాండ్‌లా బాండు పేపర్లు ఎందుకు రాసిచ్చారని ప్రశ్నించారు. హామీల గురించి అడిగితే బూతులు తిడుతున్నారని ధ్వజమెత్తారు. తాను ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్ ఎలా ఎంతోమంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎంను చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఎలాగూ మరోసారి ముఖ్యమంత్రి కాబోరని, కానీ ఉన్నన్నాళ్లైనా నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కార్మికులు అంటే రేవంత్ రెడ్డికి లెక్కలేదని అన్నారు.

*** రాహుల్ గాంధీ అడుగు పెడితే ఉన్న ఆటోలు అమ్ముకున్నాడు**

తాను కొన్ని కొన్ని నెలల క్రితం పార్టీ కార్యాలయం వద్ద కారు అందుబాటులో లేకపోవడంతో మష్రత్ అలీ అనే వ్యక్తి ఆటోను ఎక్కానని తెలిపారు. ఆ సమయంలో ఆయనతో మాట్లాడానని, ఆయన చెప్పిన విషయాల విని ఆందోళన చెందానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే మష్రత్ అలీ ఆటోను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్కారని, ఆ సమయంలో అతనికి రెండు ఆటోలు ఉండేవని చెప్పారు. రాహుల్ గాంధీ ఎక్కిన తర్వాత ఆయన తన ఆటోలను అమ్మేసుకుని కిరాయి ఆటో నడుపుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కొందరి అడుగు అలా ఉంటుందని రాహుల్ గాంధీని ఉద్దేశించి అన్నారు.

## బెంగాల్ రీపోలింగ్: 15 బూత్‌లలో రేపే పోరు!

కోల్‌కతా, మే 1, (భారత శక్తి) : పశ్చిమ బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఎన్నికల అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మగ్రాహట్ (పశ్చిమ్), డైమండ్ హార్బర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని శుక్రవారం ఆదేశించింది. పోలింగ్ రోజున ఈ కేంద్రాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్లు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఏప్రిల్ 29న రెండో దశలో పోలింగ్ జరిగిన ఈ నియోజకవర్గాల్లో శుక్రవారమే రీపోలింగ్ జరగనుంది. రీపోలింగ్ జరగనున్న 15 బూత్‌లలో 11 మగ్రాహట్ (పశ్చిమ్) నియోజకవర్గంలో ఉండగా, మిగిలిన 4 డైమండ్ హార్బర్ పరిధిలో ఉన్నాయి. ఇదిలా ఉండగా, ఇదే జిల్లాలోని ఫల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా దాదాపు 30 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిగే అవకాశం ఉందని ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయ వర్గాలు సూచిస్తున్నాయి. ఫల్టాలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పేరు, గుర్తు పక్కన ఉన్న ఈవీఎం బటన్ పనిచేయడం లేదని వచ్చిన ఫిర్యాదులపై ఈసీఐ సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈసీ నియమించిన ప్రత్యేక పరిశీలకుడు సుబ్రత్ గుప్తా స్వయంగా గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి, విచారణ జరిపారు. సుదీర్ఘ విచారణ అనంతరం, ఆయన ఫల్టాలోని 30 బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. గతంలో ఫల్టా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్ జరపాలని బీజేపీ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఏప్రిల్ 29న పోలింగ్ జరగడానికి ముందు నుంచే ఇక్కడ తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మద్దతుదారుల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పోలింగ్ రోజున కూడా అక్కడక్కడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.

## ప్రజా క్షేత్రంలో చంద్రబాబు



విజయవాడ, మే 1, (భారత శక్తి) :కృష్ణా జిల్లా ప్రజలకు అత్యాధునిక కంటి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు గుడ్లవల్లేరులో నూతనంగా నిర్మించిన ఎల్వీ ప్రసాద్ ఐ కేర్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. తన జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రారంభోత్సవంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కూడా పాల్గొన్నారు. దాతల సహాయంతో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని పెంజేంద్ర రోడ్డులో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులతో కలిసి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, వైద్య పరికరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన ఎకరం భూమిని, నిర్మాణ ఖర్చులను దాతలైన జాస్తి సుబ్బారావు, పోలవరపు సత్యనారాయణరావు కుటుంబాలు అందించాయి. కృష్ణా జిల్లా, పరిసర ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని నెలకొల్పారు. ఈ కేంద్రం ప్రారంభంతో, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని స్థానికులు భావిస్తున్నారు.

## వాణిజ్య సిలిండర్ ధరల పెంపు...
## ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, మే 01 (భారత శక్తి) : కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలిండర్ ధరలు పెంచడం వల్ల ఆ ప్రభావం అంతిమంగా సామాన్యుడిపై పడుతుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.993 పెంచారని, దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్‌లు, వీధి వ్యాపారులు, బేకరీలపై పెను భారం పడుతుందని అన్నారు. ఇది సామాన్యులకు ఆర్థిక భారమే అన్నారు. ఐదు రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు ఈరోజు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.

## నాడు వద్దన్నా వినలేదు: వరంగల్ విభజనపై కడియం

కోల్‌కతా, మే 1, (భారత శక్తి) : వరంగల్ జిల్లాను కేసీఆర్ ఆరుముక్కలు చేశారని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. జిల్లాను ముక్కలు చేయవద్దని తాను బతిమాలినప్పటికీ, ఆరు ముక్కలు చేసి ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పైకి వరంగల్ జిల్లా అని చెప్పుకోవడం తప్ప మిగిలిందేమీ లేదని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ అహంకారం నచ్చకపోవడంవల్లే కొందరు నాయకులు దూరంగా ఉంటున్నారని అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు 36 మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి చేర్చుకున్నారని విమర్శించారు. పార్టీలో చేరిన వారు ఎవరూ రాజీనామా చేయకపోయినప్పటికీ మంత్రి పదవులు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. మీరు చేస్తే రాజకీయం, ఇతరులు చేస్తే వ్యభిచారమా అని నిలదీశారు. ఇది కేసీఆర్ నేర్పిన విద్యే అన్నారు. కేసీఆర్ తీరు నచ్చకపోవడం వల్లే ఆయన నాయకత్వం నుంచి చాలామంది బయటకు వస్తున్నారని అన్నారు. కేసీఆర్ అహంకారం ఎవరికీ నచ్చడం లేదని అన్నారు.

## నా బయోపిక్ తీయాలని ఉంది.. నేనే తీస్తా: మల్లారెడ్డి

- **పవన్ సినిమాలో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారన్న మల్లారెడ్డి**
- **విలన్ అంటే హీరో చేతిలో తన్నులు తినాలని.. అది తనకు ఇష్టం లేదని వ్యాఖ్య**
- **తన పాత్రకు ఏ హీరో సెట్ అయితే ఆయనను తీసుకుంటామని వెల్లడి**

హైదరాబాద్, మే 1, (భారత శక్తి) : తెలంగాణ రాజకీయాల్లో తనదైన ట్రేడ్ మార్క్ స్పీచ్‌లతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఇప్పుడు సినిమాల గురించి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన జీవితకథను సినిమాగా తీయాలని ఉందని... ఆ సినిమాను తానే తీస్తానని ఆయన అన్నారు. పవన్ కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్'లో విలన్ పాత్ర కోసం తనను సంప్రదించారని... తాను ఒప్పుకోలేదని మల్లారెడ్డి చెప్పారు. విలన్ అంటే హీరో చేతిలో దెబ్బలు తినాల్సి ఉంటుందని, వేలాది మంది తన విద్యార్థులు, అభిమానుల ముందు అలా కనిపించడం తనకు ఇష్టం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను త్వరలోనే సినిమాల్లోకి వస్తానని మల్లారెడ్డి తెలిపారు. తన పాత్రకు ఏ హీరో సెట్ అవుతారని డైరెక్టర్ చెబుతారో ఆయననే తీసుకుంటామని... ఆ సినిమాలో తాను కూడా ఒక ప్రధాన పాత్రలో నటిస్తానని చెప్పారు.



## టీఆర్ఎస్ గూటికి మాజీ మంత్రి బోడ జనార్దన్... కవితతో భేటీ!

హైదరాబాద్, మే 1, (భారత శక్తి) :కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్ లోకి చేరికలు మొదలయ్యాయి. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి బోడ జనార్దన్ టీఆర్ఎస్ లో చేరనున్నారు. ఈరోజు బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో కవితతో జనార్దన్ భేటీ అయ్యారు. కవితతో భేటీ అనంతరం బోడ జనార్దన్ మాట్లాడుతూ, త్వరలోనే తన అనుచరవర్గంతో కలిసి అధికారికంగా పార్టీలో చేరతానని వెల్లడించారు. ముఖ్యంగా సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, పార్టీ విస్తరణకు తన వంతు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బోడ జనార్దన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత అనుభవజ్ఞుడైన నాయకుడిగా పేరుగాంచారు.



మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో కార్మిక శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది.

# కాంగ్రెస్‌కు సేవాదళ్ కార్యకర్తలే పునాది



* **మత రాజకీయాలను తిప్పికొట్టాలి: మధుయాష్కి గౌడ్**

నాంపల్లి (హైదరాబాద్): మే 1 (భారత శక్తి) : కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ కార్యకర్తలే పునాది అని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ 'సమర్థ్ శిక్షణ శిబిరం' కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సేవాదళ్ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

**స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర**

దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సేవాదళ్ పోషించిన పాత్ర మరువలేనిదని మధుయాష్కి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ వంటి నాయకులు కూడా సేవాదళ్‌లో పనిచేసిన వారేనని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కార్యకర్తలు సొంత ఖర్చులతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వీరి సమిష్టి కృషి ఎంతో దోహదపడిందని ఆయన పేర్కొన్నారు.

**నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం**

పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న సేవాదళ్ కార్యకర్తలకు ప్రభుత్వంలో తగిన గుర్తింపు లభించాలని మధుయాష్కి అభిప్రాయపడ్డారు. నామినేటెడ్ పదవుల భర్తీలో వారికి సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం మరియు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

**విభజన రాజకీయాలపై పోరాటం**



బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు అనుసరిస్తున్న మతపరమైన విభజన రాజకీయాలను అడ్డుకునే శక్తి సేవాదళ్‌కు ఉందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సమాజంలో సామరస్యాన్ని పెంపొందించే దిశగా కార్యకర్తలు మరింత చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. సేవాదళ్ బలోపేతానికి రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్ శర్మ, ఏఐసీసీ కోఆర్డినేటర్ సమద్, ప్రతినిధులు శ్రావణ్ కుమార్, అఫ్సర్ యూసఫ్, గోవింద్ రావు, వాజీద్ మెహక్, మంకాల దాస్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# తిమ్మాపూర్‌లో ఉత్సాహంగా మే డే వేడుకలు

సిద్దిపేట, మే 1 (భారత శక్తి ) : సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో మే డే సందర్భంగా శుక్రవారం హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఉషి కనకరాజు జెండా ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కార్మికులు ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కనీస వేతనం, భద్రత, సముచిత పని గంటలు వంటి ప్రాథమిక హక్కులు అందరికీ లభించాలన్నారు. కార్మిక చట్టాల రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని పేర్కొంటూ, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని సూచించారు.కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తమ హక్కుల కోసం చట్టబద్ధంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామానికి సేవలందిస్తున్న కార్మికులను శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్, ఐకేపీ, పెయింటింగ్, హమాలీ కార్మికులతో పాటు గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బి. సుమతి బాధ్యతల స్వీకరణ

* **శాంతిభద్రతల పరిరక్షణే పరమావధి.. టెక్నాలజీతో నేరాలకు చెక్**
* **సైబర్ మోసాలు, డ్రగ్స్ కట్టడిపై ప్రత్యేక నిఘా**
* **ప్రయాణీకుల భద్రతకు ప్రాధాన్యం: ట్రాఫిక్ నియంత్రణకు పెద్దపీట**
* **కమిషనరేట్‌కు తొలి మహిళా బాస్**

మల్కాజిగిరి, మే 1 (భారత శక్తి) : మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ నూతన కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారిణి బి. సుమతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మల్కాజిగిరి కమిషనరేట్‌కు తొలి మహిళా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తన ప్రాధాన్యతలను వివరించారు.

* **సాంకేతికతే ఆయుధంగా 'క్వాలిటీ పోలీసింగ్'**

నేరాల నియంత్రణలో పాత పద్ధతులకు స్వస్తి పలికి, అత్యాధునిక సాంకేతికతను (Technolo



gy) జోడించడం ద్వారా ఫలితాలను సాధిస్తామని సీపీ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత "TG QUEST" అప్లికేషన్ వినియోగిస్తూ నేరస్తుల ఆట కట్టిస్తామన్నారు. "టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌తో పాటు సేవల నాణ్యత (Quality of Policing) పెంచడమే మా లక్ష్యం. ప్రజలకు అత్యంత పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం" అని ఆమె పేర్కొన్నారు.

**సైబర్ నేరగాళ్లపై ఉక్కుపాదం**

నానాటికీ విస్తరిస్తున్న సైబర్ నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సుమతి హెచ్చరించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూరేలా 'ప్రాసెస్ ఓరియెంటెడ్ & రిజల్ట్ ఓరియెంటెడ్' విధానాన్ని అమలు చేస్తామన్నారు. సమాజానికి శాపంగా మారిన మాదకద్రవ్యాల (Drugs) సరఫరా, వినియోగంపై రాజీలేని పోరాటం చేస్తామని, ఇందుకోసం 'ప్రివెన్షన్, డిటెక్షన్, ఎఫెక్టివ్ ఇన్వెస్టిగేషన్' అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తామన్నారు. ముఖ్యంగా యువత పెడదారి పట్టకుండా ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తామని వివరించారు.

* **ట్రాఫిక్ చిక్కులకు చెక్.. సురక్షిత ప్రయాణం**

కమిషనరేట్ పరిధిలో వాహనాల రద్దీని క్రమబద్ధీకరించడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సీపీ వెల్లడించారు. "ప్రతి పౌరుడి ప్రయాణ సేఫ్టీని మెరుగుపరచడమే మా మొదటి ప్రాధాన్యత. రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెద్దపీట వేస్తాం" అని తెలిపారు. శాంతిభద్రతల విషయంలో మల్కాజిగిరి ప్రాంతానికి ఉన్న మంచి పేరును నిలబెడుతూ, బాధ్యతాయుతమైన టీమ్‌గా ప్రజలకు అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

# సర్కారు చదువు.. ప్రగతికి మెట్టు!

* **ప్రభుత్వ బడుల నుంచే ప్రపంచ స్థాయి మేధావులు**
* **ప్రతిభావంతులైన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సన్మానం**

తుర్కయాంజల్ (తొర్రూర్), మే 1 (భారత శక్తి) : భారతదేశ చరిత్రలో అద్భుతాలు సృష్టించిన మహనీయులంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారేనని, సరైన ప్రోత్సాహం అందిస్తే ప్రభుత్వ విద్యార్థులు ప్రపంచ స్థాయి మేధావులుగా ఎదుగుతారని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పది ఫలితాల్లో సత్తా చాటిన నియోజకవర్గ విద్యార్థులను, వారికి దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయులను శుక్రవారం తొర్రూర్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు.

* **కార్పొరేట్ భ్రమల నుంచి బయటకు రావాలి**

నాణ్యమైన విద్య కేవలం కార్పొరేట్ సంస్థల్లోనే దొరుకుతుందనేది ఒక అపోహ మాత్రమేనని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల నమోదైన ఉత్తమ ఫలితాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు లక్షల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్లవద్దని, సర్కారు బడుల్లో ఉన్న వసతులను, నిపుణులైన ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.





* **విద్యా రంగానికి 'రేవంత్' సర్కారు పెద్దపీట**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఆయన కీలక అంశాలను ప్రస్తావించారు: బడ్జెట్ కేటాయింపులు: విద్యారంగం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 26 వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతకు నిదర్శనం.

**నూతన విధానాలు:**

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించే ప్రక్రియ మొదలైంది.

* ఆరుట్ల మోడల్ స్కూల్: ఆరుట్లలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన తెలంగాణ మోడల్ స్కూల్ రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్త పాఠశాలలకు రోల్ మోడల్‌గా నిలవనుంది.

* **నియోజకవర్గ విద్యపై ప్రత్యేక దృష్టి**

ముఖ్యమంత్రితో చర్చించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని విద్యా సంస్థలకు మరిన్ని నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ కు ధీటుగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులను ఆయన అభినందించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత: ఉద్యమకారుల అరెస్టు దురదృష్టకరం

**హక్కులను కాలరాయడమే: జస్టిస్ చంద్రకుమార్**

హైదరాబాద్: మే 1 (భారతశక్తి) : గాంధీభవన్ వద్ద భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేయడంపై జస్టిస్ చంద్రకుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని, అటువంటి వారిని నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

* **హామీలు ఏమయ్యాయి?**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు అనేక హామీలు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను విస్మరించడం సరికాదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



**అరెస్టులపై ఖండన**

* శాంతియుత ప్రదర్శనలను అడ్డుకోవడం పౌర హక్కుల ఉల్లంఘనే అని ఆయన విమర్శించారు.
* అరెస్టు చేసిన ఉద్యమకారులను వెంటనే విడుదల చేయాలని కోరారు.
* ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని హితవు పలికారు.






Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.